
# Telugu Jyothi

# తెలుగు జ్యోతి

**A Literary Magazine from**
**The Telugu Fine Arts Society**

తెలుగు కళా సమితి వారి
సారస్వత పత్రిక

http://www.tfasnj.org | July-August 2015 | http://www.teluguJyothi.com


"ఆత్మవిశ్వాసం - నిరంతర శ్రమ" మనల్ని ఓటమి నుంచి విజయానికి చేరుస్తాయి .

- అబ్దుల్ కలాం

**"ప్రజల రాష్ట్రపతి" శ్రీ అబ్దుల్ కలాం గారికి తెలుగు కళా సమితి స్మృత్యంజలి !!**

# DENTISTRY FOR THE ENTIRE FAMILY

Member of ADA, NJDA & AEGD

## DENTAL ILLUMINATIONS

### Madhavi V. Kadiyala DDS & Associates

### General and Cosmetic Dentistry

- Digital Radiography X-Ray with Less Radiation
- Oral Hygiene, Sealants. Fluoride
- Bonding, Porcelain Veneers & Lumineers
- Teeth Whitening
- Periodontal Treatment
- One Visit Root Canals
- Metal Filling Replaced with White Restorations
- Surgical & Non Surgical Extractions
- Porcelain Crowns, Bridges & Complete Dentures

**Walk-ins & New Patients Welcome    Most Insurance Plans Accepted**

**Please Call For Appointments at Two Convenient Locations**

660 Princeton Meadows
Shopping Center,
Plainsboro Road
**Plainsboro, NJ 08536**
609-275-9688

Hopewell Crossing
800 K Denow Road
(Next to Stop & Shop)
**Pennington, NJ 08534**
609-303-0571

# PLAINSBORO PRINCETON MEDICAL ASSOC.

**Dr. Aruna Chakrala, MD**
BOARD CERTIFIED INTERNAL MEDICINE

**Dr. Sureka Reddy, MD**
BOARD CERTIFIED FAMILY MEDICINE

**Dr. Sangeeta Buddala, MD**
BOARD CERTIFIED INTERNAL MEDICINE

**Dr. Pramila Veera Swamy, MD**
BOARD CERTIFIED INTERNAL MEDICINE

***OPEN 7 DAYS A WEEK!***

Blood Draws • 2D Echo Cardiograms • EKG • All Immunization Including Travel Vaccines • Minor Skin Procedures Including Wart Removals, ***LASER SERVICES,*** Dietician, Diabetic Management, Joint Injections, Pap Smears

666 Plainsboro Road, Suite 1020 • Plainsboro, NJ 08536

***CALL TODAY 609-799-5000***

OFFICE HOURS: MON-FRI 8AM-8PM, SAT & SUN 8AM-2PM
LANGUAGES: ENGLISH, TELUGU, HINDI, MARATHI, SPANISH
AGE GROUPS : 8 YEARS & ABOVE

# తెలుగు కళా సమితి

**The Telugu Fine Arts Society, Inc**
(A tax exempt and not for profit corporation)

54 Erie Ave, Rockaway, NJ 07866

# తెలుగు జ్యోతి

సంపుటి: 32 సంచిక: 4

**జూలై – ఆగస్ట్ 2015**



**Board of Trustees**
**April 2014 – March 2016**

**President**
***Srini Gandi***
208 Margaret Ct, South Plainfield, NJ 07080
(732) 221-8017
president@tfas.net

**Vice-President**
***Guru Alampalli***
23 Harold Ave
Edison, NJ08820
(732) 277-8870
vicepresident@tfas.net

**Secretary**
***Uma Makam***
13 Alexis Lane,
Edison, NJ 08820
(732) 983-1936
secretary@tfas.net

**Treasurer**
***Vasant Naidu Tanna***
287 Pinelli Drive
Piscataway, NJ 08854
(732) 319-8155
treasurer@tfas.net

**Annual Events**
***Sreedevi Jagarlamudi***
*(732) 470-7055*
events@tfas.net

**Youth Services**
***Bindu Madiraju***
(732) 609-1836
youth@tfas.net

**Membership Services**
***Vamsi Koppuravuri***
1 Newburgh Drive,
Edison, NJ - 08820
(732) 429-4421
membership@tfas.net

**IT Services**
***Madhu Rachakulla***
(913) 220-9172
info@tfas.net

**Community Affairs**
***Madhu Anna***
(201)674-5477
community@tfas.net

**Advisors**
***Dr. Ramakrishna Seethala***
***Dr.Suneetha Kanumuri***
**Mr. Rohinikumar Vemula**

**Founder Editor:**
**Late Kidambi Raghunath**



**Editor: Diwakar Peri**, Phone (732) 329-3464
Mail articles to: 29 Yorktown Road, Monmouth Jn. NJ 08852 or diwakar.peri@gmail.com

**Associate Editors: Anantha Sudhaker Uppala** Production Support**; Radha Kasinadhuni** - Essays & Community News; **Syamaladevi Dasika** - Stories; **Dr. Vaidehi Sasidhar** – Poems.
**Madhu Anna** and **Guru Alampalli** representing TFAS Board of Trustees.


## మా మాట

"జగామ లంకాం మనసా మనస్వీ" అంటారు, అరణ్యకాండ చివరిలో వాల్మీకి మహర్షి, సముద్రాన్ని లంఘించి లంకకు చేరే ప్రయత్నంలొ వున్న హనుమ నుద్దేశించి. అంటే హనుమ మానసికంగా లంక చేరి పోయాడు అని. అబ్దుల్ కలాం కూడా అదే సందేశాన్ని ఆయన రాసిన ""ఇగ్నైటేడ్ మైండ్స్" పుస్తకం ఇంట్రోలొ రాస్తారు. ఈ ప్రపంచం లో ఏమివుందో, అదే నీలోనూ వుంది.నేను సాధిస్తాను అనుకుని నిన్నునువ్వు విజయునిలా ఊహించుకుంటే తప్పక విజయుడవౌతావన్నది కలాం గారి సందేశం. హనుమలాగే మనం కూడా మానసికంగా ఏదయినా సాధించడానికి సిద్ధపడితే అపజయం ఉండదు. "ఫీల్ లైక్ అ విన్నర్ అండ్ యు విల్ బి ఎ విన్నర్ " అన్నది ఇంగ్లీషువాడి మాట కూడా.

మనదేశానికి, ముఖ్యంగా యువతకి గొప్ప స్ఫూర్తి నిచ్చిన "మిసైల్ మేన్", అన్ని పౌర పురస్కారాల్నీ సాధించి, దేశంలోనే అత్యున్నతమయిన రాష్ట్రపతి స్థానాన్ని అలంకరించి, భారతీయతకే చిరునామాగా నిలచిన "రామేశ్వరం పేద ముస్లిం కుర్రవాడు" అబ్దుల్ కలాం ఇక లేరు అన్న వార్త దేశంలో ఆబాల గొపాలాన్నీ కన్నీరు పెట్టించింది. మనదేశం విక్రం సారాభాయ్ వంటి శాస్త్రవేత్తకి, మహాత్మాగాంధీ వంటి దార్శనికునికి, వివేకానందునివంటి ఆధ్యాత్మిక వేత్తలకి జన్మనిచ్చింది. అయితే దేశాన్ని శత్రు దుర్భేద్యం చేసిన అణు శాస్త్రవేత్త, దేశంలోని యువతకి దిశా నిర్దేశనం చేసిన దార్శనికుడు, సాంకేతికంగా ముందున్నా భారతదేశానికి జీవనాడి ఆధ్యాత్మికవాదమన్న శ్రీ అబ్దుల్ కలాం "ఒకే ఒక్కడు" అనిపించుకున్న భారతమాత ముద్దుబిడ్డ. "భగవంతుడా! నా ప్రజలు చెమటోడ్చి కష్టించనివ్వు. వారి స్వేదం, శ్రమ ఎటువంటి దుష్టత్వాన్నయినా ఎదిరించగల ఎన్నో 'అగ్ను'ల్ని సృష్టించనీయి. నా ప్రజలు సామరస్యంతో జీవించనీ. భారతదేశపౌరుణ్ణనే మహత్తర గర్వంతో నా జీవితాన్ని చాలించనీ, తిరిగి నా దేశ మహత్తర వైభవంలో నేను పునరుజ్జీవించనీ " అన్న అబ్దుల్ కలాం నిజంగా "భారత రత్న ". ఆ పురస్కారానికే వన్నె తెచ్చిన మనిషి .

"ప్రజల రాష్ట్రపతి" గా వాసిగాంచిన అబ్దుల్ కలాం అజరామరుడు. యువత స్ఫూర్తిమంతం లొ , భారత దేశ ఉన్నతిలో, మన లో, మన ధ్యేయంలో ... అన్నిటా సజీవంగా ఉంటారు. అయన చెప్పినట్లు కలలు కనడం – వాటిని సుసాధ్యం చేసుకోవడానికి కష్ట పడటమే మనం ఆయన కిచ్చే అసలైన నివాళి . కలాం కలలుగన్న భారతావని సాక్షాత్కారానికి మనం పునరంకితులమవుదాం.

భవదీయుడు దివాకర్ పేరి

## విషయసూచిక


| | |
|---|---|
| మామాట | 3 |
| TFAS President's Message | 5 |
| ముప్ఫయ్యవ వార్షికోత్సవ వేడుకలు | 6 |
| స్వప్నమూ– సందేశమూ డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం | 9 |
| అమెరికాలో శ్రీవారి ఇక్కట్లు ... డ్రైవింగ్ మూర్తి భావరాజు | 12 |
| మళ్ళీ మళ్ళీ మాయాబజార్ డా. యేలూరిపాటి అపర్ణ | 14 |
| చివరికి చంద్ర కన్నెగంటి | 17 |
| ప్రధాన మంత్రి ఆ.శ | 17 |
| అబ్దుల్ కలాం (అజ్ఞాత రచయిత) | 20 |
| అక్షరవాచస్పతి ... డా. టి. కళ్యాణ్ కుమార్ | 22 |
| అరుణోదయము శ్రీనివాస్ గుంటూరి | 27 |
| బంగారు కొండ ముకుంద రామారావు | 28 |
| నా టి.వి. సీరియల్ అనుభవం పద్మజ వక్కలగడ్డ | 30 |
| ఒకే మాట అనంత ప్రమీలా రాణి | 31 |
| రావిశాస్త్రి -'పక్కింటి అబ్బాయి' డా. వై. వి. రమణ | 37 |


కవర్ పేజీ: **"అబ్దుల్ కలాం గారికి అశ్రు నివాళి"**


The articles published and the views expressed are those of the authors and not necessarily reflect the opinions of the editors or TFAS.



Dear Friends and TFAS Family,

With your support and participation, we just celebrated our 30th Anniversary on July 11th 2015 at Newark Symphony Hall. It was the best event ever conducted by TFAS by all means. We had over 2,500 people in attendance with 40 plus artists from India and with 200 plus Local Talent. We received great feedback from many of you! Thank you. It was the best satisfying event thus far with great food, great performances by both local and international talent covering various fine arts including Drama, Literary, Music and Dance. Our program was started off with blessings from his Holiness Sri Sri SriKrishna Desika Jeeyar Swamy garu.

This big scale event wouldn't have been possible without a **team work**. Many times, many of us fail, not because of lack of hard work, because of lack of team work. At TFAS, our team proved once again and worked hard together to make the event a memorable one. From the bottom of my heart, I want to thank each one of my committee members - Vasant, Guru, Sreedevi, Uma, Bindu, Madhu R, Vamsi and Madhu A and families for their trust in me and for allowing me to lead to make this event a memorable one to all of us. Most importantly, it is you, who have participated, supported, joined, volunteered and worked hard with us to make it happen. Thank you for that! It is with this inspiration, we will continue to work hard and set the stage for better future of TFAS and for our TELUGU Community!

Many pundits, international artists called our 30th Anniversary was beyond comparison to many large scale events conducted with multimillion dollar budget. With mere less than $200,000 budget, we were able to accomplish this with tight controls and hard work of many volunteers and trustees.

On behalf of TFAS trustees, I want to thank our literary team for their dedication and hard work in producing a memorable souvenir for all of us. Our music committee rocked with local talent! Dance Committee took the dance performances to a next level. At one point, many people expressed that they had tears watching *Telugu Vaibhavam* song! Kudos to Dance committee, dance teachers and participants! Some of the dramas performed by local talent exceeded the expectations and performance of international talent. Well execution by Drama Committee! Those who attended literary session would know that it was the best by all means with best talent from India. Dr. Jonnavittula, Dr. Meegada, Suddala Ashok Teja and Kadimella. People enjoyed a lot with all these performances.

My sincere thanks to TV5, TV9, Tori and many other media partners for making this event available all over the world for our community! Our past trustees, advisors, longtime supporters, vendors and donors made this event a sweet one for all of us. Thank you all for your best support ever to TFAS!!Thank you all again for yourkind support! Yours sincerely

Srini Gandi

President TFAS (president@tfas.net)

| Expenses | | | Receipts | |
|---|---|---|---|---|
| | | | | |
| Fundraising expenses | $ 2,300.00 | | Donors & Online | $ 154,368.00 |
| Venue Charges | $ 44,617.00 | | Pledges ( Due) | $ 15,150.00 |
| Sound and Lighting | $ 15,050.00 | | | |
| Parking fee at Venue | $ 4,500.00 | | | |
| Guests Airline tickets | $ 3,102.00 | | | |
| Guests remuneration | $ 31,300.00 | | | |
| Supplies | $ 1,210.00 | | | |
| Banners and plaques charges | $ 2,170.00 | | | |
| Souvenir | $ 12,100.00 | | | |
| Food and water | $ 24,210.00 | | | |
| Hotel for Guests and Van rental | $ 4,000.00 | | | |
| Banquet Dinner | $ 9,325.00 | | | |
| Decorations and Flowers | $ 2,150.00 | | | |
| Printer charges | $ 1,660.00 | | | |
| | | | | |
| | $ 157,694.00 | | | $ 169,518.00 |
| | | | | |
| Net Profit ( after receiving dues) | $ 11,824.00 | | | |
| Net Loss as of 8/10/2015 | $ (3,326.00) | | | |



Stephen R. Shapiro, MD



Lawrence S. Kluger, MD



Jeffrey S. Unger, MD



Surya P. Irakam MD
FACP, FACG



Robert S. Wiesen, MD

# Gastromed Healthcare, P.A.

Excellence in Gastroenterology

## PREVENTION & TREATMENT OF DIGESTIVE DISEASES:

- Abdominal Pain Evaluation
- Acid Reflux & Ulcer Treatment
- Liver Disease Treatment & Evaluating
- Colon Cancer Screening
- Gastrointestinal Bleeding Management
- Hemorrhoid & Fissure Treatment
- Irritable Bowel Syndrome
- Ulcerative Colitis & Crohn's Disease
- Gallstones & Gall Bladder Disease
- Pancreatic Diseases

**www.gastromedhealthcare.com**

**Gastromed@aol.com**

286 East Main Street, Somerville, NJ
(908) 231-1999

515 Church Street, Bound Brook, NJ
(732) 356-0420

203 Towne Center Dr., Hillsborough, NJ
(908) 359-1639

1140 Stelton Rd., Suite 101, Piscataway, NJ
(732) 339-8810

## తెలుగు కళా సమితి ముప్ఫయ్యవ వార్షికోత్సవ వేడుకలు

మధు రాచకుళ్ళ (ట్రస్టీ, తెలుగు కళా సమితి)

తెలుగు కళా సమితి ముప్ఫయ్యవ వార్షికోత్సవ సందర్భంగా నృత్య, సంగీత, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు తెలుగు కళా సమితి అధ్యక్షులు శ్రీ గండి శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో జులై 10,11 తేదీల్లో న్యూజెర్సీరాష్ట్రంలో అట్టహాసంగా జరిగాయి. దీనికి పలువురు సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, సాహితీవేత్తలెందరో పాల్గొన్నారు. ఈ వేడుకకు శ్రీ దాము గేదెల గారు సమన్వయకర్తగా వ్యవహరించగా, తెలుగు కళా సమితి కార్య నిర్వాహకబృందం నేతృత్వం వహించింది. ఉత్తర అమెరికా తెలుగు సంఘాలు ప్రతీ రెండేళ్లకీ జాతీయస్థాయిలో జరిపే సాంస్క్రతిక ఉత్స వాల నమూనాలో ఈ సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరయిన వారందరూ తెలుగు కళా సమితి ఇంతవరకూ జరపిన కార్యక్రమాల్లో ఇది అత్యుత్తమంగా వున్నదని వ్యాఖ్యానించడం గమనార్హం.

జులై 10 వ తారీఖు రాత్రి 7 గంటలకు ఎడిసన్ నగరం లోని రాయల్ ఆల్బర్ట్ పేలస్-లో సంబరాల ప్రత్యేకవిందు ( బాంక్వేట్) ఘనంగా జరిగింది. తెలుగు కళా సమితి సీనియర్ లీడర్ షిప్ వారిచే జ్యోతి ప్రజ్వలన, కుమారి విష్ణుప్రియ ప్రార్ధనతో ప్రారంభ మయిన ఈకార్యక్రమాలకు శ్రీమతి గిరిజ పెనుమర్తి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. జ్యోతి ప్రజ్వలన అనతరం శ్రీమతి గిరిజ పెనుమర్తి గారు, తెలుగు కళా సమితి అధ్యక్షులు శ్రీ గండి శ్రీనివాస్ గారిని సభకు పరిచయం చేసారు. శ్రీ గండి శ్రీనివాస్, శ్రీ మధు అన్నా, శ్రీమతి శ్రీదేవి జాగర్లమూడి, శ్రీమతి బిందు మాదిరాజు మరియు శ్రీ వంశీ కొప్పురావూరి గార్లు ఆహూతుల్ని సాదరంగా ఆహ్వానించారు. అనంతరం బాంక్వేట్ కోఆర్డినేటర్, తెలుగు కళా సమితి ఉపాధ్యక్షులు శ్రీ గురు ఆలంపల్లి గారు సభికుల్ని ఉద్దేశించి ప్రసంగించారు. న్యూ జెర్సీ సెనేటర్ శామ్ థామ్సన్ గారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా విచ్చేశారు. తెలుగు కళా సమితి అధ్యక్షులు శ్రీ గండి శ్రీనివాస్ ముఖ్య అతిధిని జ్ఞాపికతో సన్మానించారు. ఈ వార్షికోత్సవ సందర్భంగా ఒక ప్రత్యేక సంచిక "ప్రతిభ" సావనీర్ ని శ్రీ వసంత నాయుడు గారి పర్యవేక్షణలో సావనీర్ కమిటీ సభ్యులు రూపొందించి, వెలువరించడం జరిగింది. తెలుగు సినీ, సాహిత్యరంగాల్లో లబ్ధ ప్రతిష్టులయిన శ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు, శ్రీ సుద్దాల అశోక్ తేజ, సహస్రావధాని శ్రీ కడిమిళ్ళ వర ప్రసాద్ మరియు శ్రీ మీగడ రామ లింగస్వామి గార్లు ఈ సావనీర్ ను ఆవిష్కరించారు. శ్రీ రాచకుళ్ళ మధు గారు విశిష్ట అతిధుల్నీ, సావనీర్ కమిటీ సభ్యులని పరిచయం చేసారు. తెలుగు వారి అభిమాన నటీమణులు కాజల్ మరియు లయ అందరిని అలరించారు. అనంతరం ఈ వార్షికోత్సవ కార్యక్రమాలు విజయవంతంగా జరగడానికి సహాయం చేసిన ప్రాయోజకులు, వదాన్యులు శ్రీ ప్రేమ్ నందివాడ, శ్రీ మల్లా రెడ్డి, శ్రీ సుధాకర్ రాయపూడి, మరియు జి. & సి., కంపెనీ వారిని ముఖ్య అతిధి శ్రీ శామ్ థామ్సన్ గారు శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. విందు భోజనంతో పాటుగా స్వర్ణక్క, శ్రీమతి ఆదర్శిని, లలిత రాణి, కృష్ణ రాణి మరియు విష్ణు ప్రియల సంగీత విభావరి జరిగింది. శ్రీమతి ఉమా మాకం గారి వందన సమర్పణ తో మొదటి రోజు కార్యక్రమాలు ముగిశాయి.

జులై 11 న నూవార్క్ సింఫనీ హాల్లో ఉత్సవాల రెండవ రోజు కార్యక్రమాలు జ్యోతి ప్రజ్వలన, శ్రీ శ్రీ శ్రీ కృష్ణ దేశికా జియ్యర్ స్వామీజీ గారి ఉపదేశ వాక్యాలతో ప్రారంభమయ్యాయి. తరువాత తెలుగు కళా సమితి వారి సాంస్కృతిక కార్యక్రమాలు శ్రీమతి శ్రీదేవి జాగర్లమూడి గారి ఆధ్వర్యంలో వినూత్న రీతిలో ప్రదర్శింపబడ్డాయి. శ్రీ మధు అన్నా గారి పర్యవేక్షణలో స్థానిక కళాకారుల చే "పరమానందయ్య శిష్యులు", "తెలుగు క్రూజ్ లైన్స్" మరియు "కీర్తన" నాటికలు ప్రదర్శించారు. శ్రీ మధు రాచకుళ్ళగారి పర్యవేక్షణలో "నూవార్క్ స్టేజ్" ఆడిటోరియం లో లిటరరీ కమిటీ చైర్ పర్సన్ శ్రీమతి రాధ కాశీనాథుని గారి ఆధ్వర్యంలో సాహిత్య కార్య క్రమం జరిగింది. వేదకవి శ్రీ జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు, గురుసహస్రావధాని శ్రీ కడిమిళ్ళ వరప్రసాద్, సినీ కవి సుద్దాల అశోక్ తేజ, శ్రీ మీగడ రామలింగేశ్వర స్వామి గార్లు ఈ సాహితీ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీమతి బిందు మాదిరాజు గారి పర్యవేక్షణలో పలు రకాల నృత్యరూపకాలు అత్యంత రమణీయంగా

ప్రదర్శించారు. సుమారు 100 మంది స్థానిక కళాకారులచే శ్రీ జొన్నవిత్తుల రచించిన “తెలుగువైభవం” నృత్య రూపకానికి ప్రత్యేక ప్రశంసలు లభించాయి. శ్రీ జొన్నవిత్తుల మాట్లాడుతూ గత 10 సంత్సరాలలో ఉత్తర అమెరికాలో ఇంత గొప్పగా తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలు జరగటం తాను చూడలేదన్నారు. శ్రీమతి బిందు మాదిరాజు గారి అధ్వర్యంలో, ఆమెచే రూపొందించబడ్డ “మహిళా ఫాషన్ షో” విశేషంగా యువతరాన్ని ఆకట్టుకుంది. శ్రీమతి శ్రీదేవి జాగర్లమూడి గారి పర్యవేక్షణలో మునుపెన్నడూ లేనివిధంగా అద్భుతమైన వివిధ రకాల సంగీత కార్యక్రమాలు ప్రదర్శించారు. మొట్టమొదటిసారిగా సంగీత వాద్య పరికరాలతో రూపొందించి న ఇండియన్ రాగా గ్రూప్ వారి “సింఫనీ ఇన్స్ట్రుమెంటల్ ఎన్సెంబల్”ఆహూతుల్ని అలరించింది. శ్రీమతి శ్రీదేవి జాగర్లమూడి పర్యవేక్షణలో సుమారు 70 మంది స్థానిక బాల బాలికలకు శ్రీ హరప్రసాద్, శ్రీ శ్రీకాంత్, శ్రీమతి హరిణిలు శిక్షణ ఇచ్చి ప్రదర్శించి న సంగీత కార్యక్రమం “సింఫనీ టాలి వుడ్” వీనుల విందు చేసింది. ఇంకా కళాంజలి స్కూల్ ఆఫ్ డాన్స్, సిద్ధేంద్ర కూచిపూడి ఆర్ట్ అకాడమీ, నృత్య మాధవి స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులచే ప్రదర్శించబడ్డ ప్రఖ్యాత సినీ దర్శకుడు కే.విశ్వనాధ్ సినీ గీతాలకు నృత్యాలు, దక్షా గ్రూప్ వారి “యూత్ టాలీవుడ్ మెడ్-లీ”, శ్రీ ఆనంద్ నృత్యాలయం వారి సెమి క్లాసికల్ డాన్సులు, కవి స్కూల్ ఆఫ్ డాన్స్ వారి “జై హనుమాన్” రూపకం ఆకట్టుకున్నాయి. సినీ, టీవీ కళాకారుల “జబర్దస్త్”, సెంటర్ ఫర్ కూచిపూడి డాన్స్ “తిల్లానా”, కవి స్కూల్ ఆఫ్ డాన్స్ ”టాలివుడ్ ధమాఖా” ఆకట్టుకున్నాయి. శ్రీమతి ఉమా మాకం గారు వేదిక ఏర్పాట్లు పర్యవేక్షిస్తూ, అతిధులకు, ప్రదర్శకులకు జ్ఞాపికలు, శాలువాలు అందచేసారు. సమయం మించిపోయినప్పటికి అందరు కళాకారులకు అవకాశం ఇచ్చి శ్రీమతి శ్రీదేవి జాగర్లమూడి, శ్రీమతి బిందు మాదిరాజు, శ్రీమతి ఉమా మాకం గార్లు అన్నిసాంస్కృతిక కార్యక్రమాలను అత్యంత చాకచక్యంగా నిర్వహించారు. పటిష్టమై న ప్రణాళికతో ఆర్ధికవ్యవహారాలను, టిక్కెట్ల నిర్వహణ, “ప్రతిభ” సావనీర్ వ్యవహారాలను కోశాధికారి శ్రీ వసంత నాయుడు గారు అత్యంత సమర్ధనీయంగా నిర్వహించి పలువురి మెప్పు పొందా రు. మీడియ,పబ్లిసిటి,కళాకారుల వసతి, ప్రయాణం, వేదిక పై ఆడియో & విడియో, లెడ్ స్క్రీన్ ఏర్పాట్లు వంటి బాధ్యతలు శ్రీ వంశీ కొప్పురావూరి గారు పర్యవేక్షించారు. తెలుగు కళా సమితి ముప్ఫయ్యవ వార్షికోత్సవ వేడుకలకు నిధుల సమీకరణకై శ్రీ గురు ఆలంపల్లి మరియు శ్రీ గండి శ్రీనివాస్ గార్లు అహర్నిశలు శ్రమించారు. నిధులను అందచేసిన దాతలకు శ్రీ గురు ఆలంపల్లి గారు కృతజ్ఞతలు తెలియచేసారు. ఈకార్యక్రమాలకు శ్రీమతి గిరిజ పెనుమర్తి మరియు శ్రీమతి శ్రీలక్ష్మి కులకర్ణిలు గార్లు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.రాత్రి విందు భోజనానంతరం ప్రఖ్యాత సినీ సంగీత దర్శకుడు శ్రీ అనూప్ రూబెన్స్ దర్సకత్వంలో వారి బృందంచే “సంగీత విభావరి” జరిగింది. కార్యకర్తలుగా పనిచేసిన శ్రీ మురళి మేడిచర్ల, శ్రీ రవి దన్నపనేని, శ్రీ అరుణ్ శ్రీరామినేని, శ్రీ రవి పుస్కూర్, శ్రీమతి సరోజ, శ్రీ రాజు కొత్తమసు, శ్రీ వెంకట్ జాగర్లమూడి, శ్రీ సురేష్ మాకం, శ్రీ సుధీర్ కొప్పురావూరి, శ్రీ శ్రవణ్ కొంకిపల్లి, సురేష్ పద్మనాభిని గార్లకు శ్రీ గండి శ్రీనివాస్ గారు ధన్యవాదములు తెలియచేసారు. ఈ రెండు రోజులూ “మిర్చి” రెస్టారెంట్ వారు చవులూరే రుచులతో కమ్మని వంటకాల్ని ఆహుతులకు వడ్డించారు. సుమారు 2500 మందికి పైగా తెలుగు వారు తిలకించి ఈకార్యక్రమాలను విజయవంతం చేసారు. అనంతరం తెలుగు కళా సమితి కార్య నిర్వాహక బృందం వారిచే, వందన సమర్పణ, “జనగణమన” జాతీయ గీతాలాపనతో తెలుగు కళా సమితి ముప్ఫయ్యవ వార్షికోత్సవాలు ముగిసాయి.





***Roopa Nampally - Coldwell Banker Broker Sales Associate***

**50 Princeton Hightstown Road**
**Princeton Junction 732-397-9185 (Cell)**
**Website: www.roopanampally.net**
**E-Mail: nroopa@comcast.net**

COLDWELL BANKER
RESIDENTIAL BROKERAGE

**Member of (Radha Cheerath Team).**



Buying or selling a home is one of the most important decisions you make in your life. Equally important is the right Real Estate Agent for that job.

You need a Real estate agent, like me, who has gone through formal training on an on-going basis and who will guide you through the many steps and decisions you make in the process of buying or selling a home.

Commitment to my job, superior negotiating skills, knowledge, easy accessibility, honesty, and hard work are very important to this job and those are my foremost qualities.

I will do my best to make your real estate experience as easy and as stress-free as possible.

## *Internal Medicine Group*

**Board Certified**

Dr. Arvind Doshi M.D.
Dr. Priti Mehta M.D.
Dr. Sujatha Muppala M.D.

Health is the only everlasting wealth. An ounce of Prevention is worth a pound of cure

- High Blood Pressure, Diabetes and High cholesterol are "Silent Killers" and tight control will prevent heart attacks and stroke
- Hospital affiliations with St. Peter Hospital, JFK Medical Center and Princeton Hospital
- Learn the Secrets of Nutrition to achieve desired Weight Loss
- Learn about all the Cardiovascular risk factors responsible for clogging the arteries

**<u>Office Hours:</u>**
Monday – Friday : 9.00 AM to 5.00 PM
Saturday : 9.00 AM to 2.00 PM

5 Stanworth Road
Kendall Park, NJ 08824
Phone: (732) 297-2343

906 Oak Tree Road, Suite K
South Plainfield, NJ 07080
Phone: (908) 822-2277

# స్వప్నమూ – సందేశమూ

డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం

(దేశమంటే మనుషులే, జాతులు నిర్మించాబడేది మనుషులతోనే. వారి సమిష్టి కృషితో ఏ జాతయినా తానూ ఇది కావాలనుకుంటే దాన్ని సాధించగలదు. భారతీయుల్ని, ముఖ్యంగా యువతని ఉత్తేజితుల్ని చేయడమే "ఇగ్నైటేడ్ మైండ్స్" పుస్తక ప్రధాన ఇతివృత్తం. నేను ముందు రాసిన పుస్తకాలు "వింగ్స్ అఫ్ ఫైర్", "ఇండియా 2020: ఎ విజన్ ఫర్ ది న్యూ మిలీనియం" నా సహచరులు అరుణ్ తివారి, వై.ఎస్.రాజన్ లతో కలసి రచించినవి. ఈ పుస్తకం కూడా ఈ ఒరవడిలోనే ముందుకు వచ్చింది.

2020 నాటికి భారత దేశాన్ని అభివృద్ధి చెందిన దేశం గా రూపొందిచగలిగినది యువజనులే అన్న నమ్మకంతో వారిలో దాగి వున్న అగ్నిని రగుల్కొలపడానికి నేనీ పుస్తకం రాసాను. నా సాంకేతిక వృత్తి జీవితం పొడవునా, నా నిర్వహణానుభవమంతా నేను యువశక్తి పైనే ఎక్కువగా ఆధారపడ్డాను. నా యువ బృందాలే నాకెప్పుడూ బలంగా ఉంటూ వచ్చాయి. వారు నన్ను ఎప్పుడూ తల దించుకునేలా చెయ్యలేదు. కొన్ని కొన్ని పరీక్షాత్మక సమయాల్లో, కొన్ని కొన్ని సంక్లిష్ట బాధ్యతల్ని వారితో కలిసి నెరవేర్చడంలోనూ ఎటువంటి తృప్తి వుందని! వారికే గనుక తగిన స్వాతంత్రమూ, దిశా నిర్దేశనమూ గనుక లభిస్తేనా! మన యువతరం మనకన్నా మెరుగ్గా దేశాన్ని ముందుకు తీసుకుపోగలరనడంలో నాకేమీ సందేహం లేదు.

*"కలలు కనండి, కలలు కనండి, కలలు కనండి*
*కలలు భావాలుగా మారుతాయి*
*భావాలు కార్యాచరణ గా ఫలిస్తాయి"*

***మనలో ప్రతి ఒక్కరూ మనలోని వున్నత వ్యక్తిత్వం పట్ల మేల్కొనాలి. మనమొక గొప్ప గతానికీ – మహోన్నత భవిష్యత్తుకీ నడుమ సేతువులం. మనలో నిద్రాణంగా వున్న శక్తిని రగిల్చి అది మనకు దారి చూపేట్లు చేసుకోవాలి. నిర్మాణాత్మక ఉద్యమాలమీద కృషి చేసే అటువంటి హృదయాల ప్రకారం శాంతినీ, సౌభాగ్యాన్నీ, జాతికి అనుగ్రహాన్నీ తీసుకు వస్తుంది. ఆధ్యాత్మికతను విద్యతో అనుసంధించాలి. ఆత్మా సాక్షాత్కారం దానికి ముఖ్యాంశం కావాలి. మనుషులు తామేట్లా ఉన్నామని నమ్ముతూంటారో అలానే పరిణమిస్తారు. నేనొక పని చేయలేనని నమ్ముతూనట్లయితే నిజంగానే నాకా పని అసాధ్యమయిపోతుంది. కానీ నేనే గనక నాకది సాధ్యమని నమ్మానా, అప్పుడు దాన్ని సాధించగలిగే శక్తి నాకు మొదట్లో లేకపోయినా నేనా శక్తిని ఎప్పటికయినా సాధించుకో గలుగుతాను"***
***- మహాత్మా గాంధీ***

నేనూ ప్రత్యేకంగా యువ విద్యార్థులనే ఎందుకు కలవాలి? దానికి జవాబు వెతుకుతూ నేను నా విద్యార్థి జీవితపు రోజుల్లోకి వెళ్ళిపోయాను. రామేశ్వరం దీవి నుంచి నేను చేసింది ఎటువంటి ప్రయాణమని? వెనక్కి తిరిగి చూసుకుంటే అదంతా నమ్మశక్యం కానట్లే ఉంటుంది. దాన్నట్లా సాధ్యం చేసినదేది? కష్టపడి చదవడమా? ఉన్నతాశయాలా? చాలా విషయాలు స్ఫురిస్తున్నాయి నాకు. అన్నిట్లోకి ముఖ్యమయినదని నాకేమనిపిస్తూన్నదంటే నేను నా రంగంలో చేసిన సేవల బట్టే నా జీవిత సార్ధక్యాన్ని అంచనా వేసుకోవడమని. అన్నిట్లోకల్లా ప్రాధమికమైనదేమంటే నువ్వు జీవితంలో భగవంతుడు నీకు అనుగ్రహిస్తున్న వాటికి మంచిమంచి వాటెన్నింటికో అర్హుడవని గుర్తించడం. మన విద్యార్థులు తాము అభివృద్ధి చెందిన భారతదేశ పౌరులుగా జీవించే అర్హత కలిగి ఉన్నామని నమ్మగలిగితేనే వారు బాధ్యతాయుతమయిన, చైతన్యవంతమైన పౌరులుగా మారగలుగుతారు. నేను యువకులతో మాట్లాడాలనుకోవడానికి కారణమిదే. వాళ్ళ స్వప్నాలేవో తెలుసుకోవడానికి.

యువతనెప్పుడూ కలలు కనమనే చెప్తాను. మనలో ప్రతి ఒక్కరిలోనూ విజయాల్ని సాధించగల శక్తులు నిబిడమై ఉన్నాయన్న అవగాహన దీనికి ప్రాతిపది.క మన ఆకాంక్షల వైపుగా మనల్ని ఆకర్షింపచేసే శక్తులవి. ఒక బాలుడిగా ఐన్‌స్టీన్ మొట్టమొదటి సారిగా దిక్సూచిని చూచినప్పుడు దాన్ని ఏ దిక్కుకి తిప్పినా దానిలో ముల్లుకూడా తిరగడం అతన్ని మురిపింపచేసింది. ఆ ముల్లునట్లా చూస్తూండటం అతనికో వ్యామోహమయిపోయింది. దాన్నే చూస్తూ ఆ ముల్లు కదలికల వెను

కుండే అదృశ్య శక్తిని సంభావించడం మొదలుపెట్టాడు. ఆ శక్తి స్థావరం ఎక్కడ? దాన్ని నియంత్రించేదేవరు? ఆ శక్తి ఎప్పుడూ పనిచేస్తూ ఉంటుంది. ఎందుకని? ఆ శక్తి ఏ పదార్థంతో నిర్మిత మయింది? అది పనిచెయ్యని ప్రదేశాలు కూడా ఉన్నాయా? నిజమే. భూమికుండే అయస్కాంత ఆకర్షణే దిక్సూచి ముళ్ళు అనబడే ఆ అయస్కాంతపు తునకని కూడా కదిపేది. భూ అయ స్కాంత క్షేత్రపు ఉత్తర – దక్షిణ అక్షం తన వెంబడి ఆ ముల్లు కూడా కదుపుకుంటుందది. కానీ ఆ విషయంలో ఉన్నదంతా అంతేనా? మనం అయస్కాంత క్షేత్రం పనిచేయ్యడాన్ని గ్రహించ గలం కానీ, మన ఇంద్రియాలతో గమనించలేం. కానీ ఆ శక్తి భూ మ్మీద ప్రతీ చోటా పని చేస్తూనే వుంటుంది. అటువంటప్పుడు తార్కికంగా అది మనలోపల కూడా వుండి వుండాలి.

మన భూమి ఒక గ్రహంగా నిరంతర చలన స్థితిలోనే వుంటుంది. అది విశ్వ వీధిలో భ్రమణాల చలనం. ఈ గ్రహం మీద ప్రతీ ఒక్కటీ సదా చలన స్థితిలోనే వుంటుంది. కానీ పైకి మటుక్కు ప్రతీ ఒక్కటీ చలన రహిత స్థితిలో ఉన్నట్లే కనిపిస్తుంది. నేను ఈ గ్రహం మీద ఉన్నాను కాబట్టి నేను కూడా ఈ గ్రహాన్ని చలింపచేసే శక్తిలో ఒక భాగాన్నే. ఈ భూగ్రహానికి సారాంశప్రాయమయిన శక్తి ఏదో అది నాలో కూడా వుంది. మనం బలంగా కోరుకున్న వస్తువు ల్ని మన దగ్గరకు తెచ్చుకోవడానికి ఈ సర్వవ్యాప శక్తిని ఉపయో గించుకోవచ్చని డయ్యర్ అంటాడు. ఎందుకంటే మనమేది కోరు కుంటున్నామో అది మనలో ఉన్నట్లే, మనలొ వున్నది కూడా మనం కోరుకునేదానిలో వున్నది కనుక. అది ఒకదాని కొకటి జతగూడటానికి చెందిన విషయం. అందుకని అది మనలో ఉండే ఈ శక్తిని వెలికితీయడానికి కూడా సహకరిస్తుంది.

మనమేదో, మనం దేన్నీ విశ్వసిస్తామో అది మాత్రమే. మనని సృజించిన శక్తి వివేకంలో ఒకసారి మనం నమ్మకం పెట్టుకున్నాక ఇక జీవితాంతం మనల్ని నడిపించగల విశ్వాసాన్ని మనం అభివృద్ధి పరచుకోగలం. ఉన్నత శక్తి పట్ల మనకు పరిజ్ఞానం బాగానే వుంది. దానిని అత్యున్నత శక్తి అనడం సమంజ సమనుకుంటాను. తరతరాల పాటు మన పూర్వీకులు ఈ భావన నే నమ్మి జీవించారు. ఒక సందర్భంలో నేను బెంగుళ రులో పిల్లలనుద్దేశించి ప్రసంగించబోతూ, నా మిత్రుడోకాయన్ని నాకేమ యినా సూచనలివ్వగలడేమో అని ప్రశ్నించాను. అతడు నాకేమీ సూచనలివ్వలేదు గానీ, ఈ మంచి మాటలు మటుకు చెప్పాడు.

“***నువ్వు మాట్లాడేటప్పుడు, నిజం మాట్లాడు. వాగ్దానం చేసేటప్పుడు నిలబెట్టుకో. నీ మీద నమ్మకాన్ని వమ్ము చెయ్యకు. ఎవ్వరి మీదా చెయ్యి ఎత్తకు. అలాగే చెడ్డదాన్ని, అన్యాయమ యినదాన్నీ అందుకోవడానికి చెయ్యి చాచకు. అన్నిట్లోనూ ఉత్తమ మయినదేమిటి? తోటి మనిషి హృదయాన్ని స్పందింపచేసి, సంతో షపరచడం, ఆకలి గొన్న వారికి అన్నం పెట్టడం, గాయపడ్డ వారిని ఆదుకోవడం, దుఃఖితుల దుఃఖాన్ని చల్లబరచడం, దెబ్బ తిన్న వారిని ఓదార్చడం ... భగవంతుడి దృష్టిలో ప్రతీ ప్రాణీ అయన కుటుంబంలో భాగమే. సృష్టిలో ప్రతీ ఒక్క ప్రాణి కోసం ఎవరు తపిస్తారో అతడే దేవుని కెక్కువ సన్నిహితుడు...***” ఇవి మహ్మద్ ప్రవక్త ప్రవచనాలు. నాకీ మాటలు గుర్తు చేసినది తమిళనాడుకు చెందిన ఘనాపాఠీ అయిన ఒక దీక్షితార్ కి ముని మనమడు వై.ఎస్.రాజన్. అటువంటి దృక్పథం మనదేశంలో మాత్రమే సాధ్యం. ఋగ్వేదంలొ ఒక మంత్రం "ఆనో భద్రాః క్రతవోయంతు విశ్వతః" – శుభప్రదమయిన ఆలోచనలు అన్ని వైపులనుంచీ మాకందుగాక అని.

మన ఆధ్యాత్మిక వివేకమే మన బలం. దండయాత్రల నుంచీ, వలసవాదపు మృత్యువాతనుంచీ ఒక జాతిగా మనం బతికి బయట పడ్డాం. మన స్వంత సమాజం లోని చీలికలకు, విభేదాలకూ తట్టుకోవడం కూడా అలవర్చుకున్నాం. కానీ ఈ సర్దుబాటు ప్రక్రియలో భాగంగా మనం మన ఆశయాల్నీ, ఆదర్శాల్నీ కూడా చిన్నబుచ్చుకున్నాం. మనం మన విశాల దృక్పథాల్ని తిరిగి అందుకోవాలి. మన అమూల్య వారసత్వం మీంచి, వివేకం మీంచి మన జీవితాల్ని మెరుగుపరచుకొని పునఃనిర్మించుకోవాలి. మనం సాంకేతికంగా పురోగమిస్తున్నా మంటే, మనం ఆధ్యాత్మికం గా పురోగమించనవసరం లేదని కాదు. మన అంతర్గత బలాల ఆధారంగా మన అభివృద్ధి నమూనాను మనమే దేశీయంగా రూపొందించుకోవాలిప్పుడు.

వైఫల్యాల నడుమ విజయ గాథలు కూడా వున్నాయి. సంక్షోభం నడుమనే ఆశ వుంది. సమస్యల నడుమనే వాగ్దానం వుంది. మనం బహుళ విశ్వాసాలకూ, భావ జాలాలకూ చెందిన

నూరు కోట్ల ప్రజలం. మనకొక జాతీయ దర్శనం లేనట్లయితే లోపల పగుళ్ళు పైకి తేలి మనల్ని దుర్బలుల్ని చేస్తూనే వుంటాయి. ఈ పగుళ్ళకి అతుకుపెట్టి మనల్ని మనం ఒక జాతీయ వేదికగా పోతపోసుకోవలసి వుంది.

మనం తరచూ విస్మరించే అంశమేమంటే దేశంలో దాదాపు 70 కోట్లకు పైగా జనాభా 35ఏళ్ల లోపు వారే. ఈ 70 కోట్ల మందికీ భారత దేశాన్ని అభివృద్ధి పథంలొకి తీసుకుపోవాలన్న కోరికా, సామర్ధ్యమూ, ఉత్సాహమూ, ఉన్నాయి. మార్పుని సాధ్యం చేయగల మహా శక్తి అది. మనం విజయం సాధించాలంటే మన కార్యక్రమాలనీ, విధానాల్నీ నిర్దిష్ట లక్ష్య రేఖల ప్రకారం చేపట్టాలి. దారి గతుకులతో వుంటే ప్రగతి వేగంగానూ, సజావుగానూ వుండదు. మనకి అందుబాటులో వున్న ప్రాకృతిక, మానవ సహజ వనరులన్నింటినీ మనం పూర్తిగా వినియోగించుకోవాలి.

మనం దేన్ని తీవ్రంగా వాంఛిస్థామో, దానివైపుగా లాక్కుపోయేది అదే. విజేతల్ని , పరాజితుల్నుంచి వేరు చేసేదదే. మనం మనలోని ఉన్నత వ్యక్తిత్వాన్ని కనుగొనాలని, మనల్నొక అభివృద్ధి చెందిన దేశ పౌరులుగా చూడాలనీ, కోరుకోవాలనీ నేనీ "ఇగ్నైటేడ్ మైండ్స్" పుస్తకంలో చెప్పడానికి ప్రయత్నించాను. మనమొక మహా నాగరికతకు చెందిన వాళ్ళం. ఇక్కడ జన్మించిన ప్రతీ ఒక్కరూ, ఆ నాగరికతా వివేకంలో విశ్వాసముంచాలి. మనకీ, బయట ప్రపంచానికీ మధ్య అడ్డుగోడలు లేవని, మనం ప్రపంచంలో ఏ మేరకు భాగమో, ప్రపంచం కూడా ఆ మేరకు మనలో అంతే అంతర్భాగమనీ, మన మహనీయ గ్రంధాలు చెప్తున్నాయి. ఈ విశ్వ సంగీతంలో శ్రుతి కలపడం ఇక నీ వంతు. విద్యార్థులు, యువతీయువకులు భారత దేశాన్ని ఒక అభివృద్ధి చెందిన దేశంగా రూపొందించడానికి తమని తాము సిద్ధ పరచుకోవాలి. మీ మనసుల్ని రగిలించండి. ఉన్నతం గా ఆలోచించండి.

**భగవంతుడా! నా ప్రజలు చెమటోడ్చి కష్టించనివ్వు. వారి స్వేదం, శ్రమ ఎటువంటి దుష్టత్వాన్నయినా ఎదిరించగల ఎన్నో 'అగ్ని'ల్ని సృష్టించనీయి. నా ప్రజలు సామరస్యంతో జీవించనీ. భారత దేశ పౌరుణ్ణనే మహత్తర గర్వంతో నా జీవితాన్ని చాలించనీ, తిరిగి నా దేశ మహత్తర వైభవంలో నేను పునురుజ్జీవించనీ!**



# అమెరికాలో శ్రీవారి ఇక్కట్లు ... డ్రైవింగ్

మూర్తి భావరాజు

("అమెరికా ఇల్లాలి ముచ్చట్ల"లో ఇల్లాలి గొడవ విన్నారుగా ... మరి "అమెరికాలో శ్రీవారి ఇక్కట్ల" గురించి "తెలుగు జ్యోతి" ద్వారా చెప్పి, కొంత సమర్ధించుకోవడమే ఈ నా ప్రయత్నం. తెలుగు కళా సమితి ౩౦వ వార్షికోత్సవ సావనీర్ లో మొదటి సారిగా కొన్ని "అమెరికా శ్రీవారి ఇక్కట్లు" చదివే వుంటారు. ఇక చదవండి మరికొన్ని ఇక్కట్లు ...)

"మాతమ్ముడు, మరదలు JFKకి మధ్యాహ్నం రెండు గంటలకి flightలో వస్తున్నారు. మనం వాళ్ళని తీసుకోని రావడానికి వెళ్ళాలి రేపు" అంది అమెరికా ఇల్లాలు, అంటే నా శ్రీమతి.

"అది ఆఫీసు టైము కదా రెండు గంటలు వెళ్ళడం, మరో రెండు గంటలు తిరిగి రావడం ఎల్లా కుదురుతుంది నాకు" అని అడిగారు అమెరికా శ్రీవారు, అంటే నేను. "అయినా న్యూజెర్సీలో ఉన్న మనకి, JFK బదులు, నూవర్క్ కి రమ్మని ఎందుకు చెప్పలేదు? నూవర్క్ కి 40 నిమిషాలలో వెళ్ళవచ్చుగా" అన్నాను.

"JFK కి ఇద్దరికీ కలిపి 100 డాలర్లు తక్కువకి వచ్చాయిట టిక్కట్లు" అని జవాబు.

'అయితే ఆ 100 డాలర్లు టోల్స్ కి, గాస్ కి నేను ఖర్చు పెట్టాలనన్నమాట' అనుకున్నాను మనస్సులో. "వాళ్లకి చవక టిక్కట్లు - నాకు డ్రైవింగ్ ఇక్కట్లు" అన్నమాట.

"అయితే నువ్వే వెళ్ళకూడదూ JFKకి" అనడిగాను.

"అమ్మో! నేను ఎయిర్-పోర్ట్ కి, డౌన్ టౌన్లకి డ్రైవ్ చెయ్యను, అది మీ పని" అని జవాబు. మాఇద్దరికి ఒకేసారి డ్రైవర్ లైసెన్సు వచ్చినా, నా ఇల్లాలు కొన్ని చోట్లకి తను డ్రైవ్ చేయలేనను కుంటుంది. ఇక తప్పేదేముంది, అటువంటి ప్రదేశాలకి శ్రీవారు డ్రైవ్ చెయ్యవలసిందే.

* * *

దూరపు కారు ప్రయాణాలలో (డ్రైవింగ్) నా ఇల్లాలు, పట్టణాలు, ట్రాఫిక్ సందడి అన్నీ దాటాక, హైవే ఖాళీగా ఉన్నప్పుడు మాత్రమే డ్రైవ్ చేస్తుంది. అప్పుడప్పుడు నాకు కునికిపాట్లు వచ్చినప్పుడు డ్రైవింగ్ ఇల్లాలికి ఇవ్వడం జరుగుతుంది. డ్రైవింగ్ లో కునికిపాట్లు వచ్చినప్పుడు తరుణోపాయం-ఇల్లాలితో ఏదో విషయంలో వాదప్రతివాదాలు పెట్టుకుంటే వెంటనే నిద్ర తేలిపోతుంది. ఏ విషయం అని అడుగుతున్నారా? బోలెడు విషయాలు. ఉదాహరణకు, ఇంట్లో 'వస్తువులు, పేపర్లు ఎక్కడ పడితే అక్కడ – చీదరగా వున్నాయి' అని మొదలు పెట్టవచ్చు, దానికి ఇల్లాలే బాధ్యత అని అర్ధమయేలా. వెంటనే ఇల్లాలు శ్రీవారి బాధ్యతల జాబితా గబగబ చదివేస్తుంది, కాగితం లేకుండానే. ఈ బాధ్యతలగురించి ఒక అరగంట సేపు వాదించుకోవచ్చు చక్కగా, కునికిపాట్లు పోయేదాకా. వాదనలు కూడా అదుపులో పెట్టుకోవాలి, లేకపోతే మన కారు మరో కారునో, చెట్టునో గుద్దుకునే ప్రమాదం ఉంది.

మా అమెరికా ఇల్లాలు క్రొత్తప్రదేశాలకి వెళ్ళినప్పుడు, జి.పి.ఎస్. (అమెరికా ఇల్లాలి భాషలో దానిపేరు 'దారిదేవత') చెప్పినట్టే వెళ్తుంది. ఎడమవైపు తిరుగు, కుడివైపు తిరుగు, తిన్నగా వెళ్ళు, ఆగు అనే నాలుగు ఆజ్ఞనలు మాత్రమే తెలుసు. ఆ హైవే పేర్లు, వీధుల పేర్లు, దిక్కులు ... ఇవన్నీ తనకనవసరం. మాప్ చూడడం అసలు అలవాటు లేని పని. ఒక్కొక్కసారి జి.పి.ఎస్. మరో ఊరులో మరో ఇంటికి చేర్చిన సంఘటనలు ఉన్నాయి. ఒక అమెరికన్ స్నేహితుల ఇంటికి వెళ్తోంటే, జి.పి.ఎస్. బోలెడు తెలుగు వాళ్ళుండే కాంప్లెక్స్ కి చేర్చింది. కారు ఆపి, ఒక తెలుగ బ్బాయిని "రాబర్ట్ స్మిత్ అనే ఆయన ఇల్లు ఎక్కడో తెలుసా?" అని అడిగాం. "అబ్బే! ఇక్కడ ఫారినర్స్ ఎవరూ లేరే" అని జవాబు చెప్పాడు, ఆ మహానుభావుడు తను అమెరికాలో ఉన్నట్టు మరచిపోయి. జి.పి.ఎస్. ఉపయోగించడంలో శ్రీవారు పూర్తి వ్యతిరేకం. బయలుదేరే ముందు మాప్ చూసి, ఏదారిలో వెళ్ళాలో నిశ్చయించుకుని, గుర్తు పెట్టుకుని, జి.పి.ఎస్. చెప్పే ముందే తనే దారి చెప్పుకుంటూ డ్రైవ్ చేస్తారు.

* * *

ఈ విషయాలు ఎలావున్నా, వయసు వస్తున్నకొద్దీ డ్రైవింగ్ గురించి కొంచెం భయాలు వస్తున్నాయన్నమాట నిజం. 80, 90 సంవత్సరాల వయసు వచ్చినవాళ్ళు ఇంకా డ్రైవ్ చేస్తున్నారంటే చాలా సంతోషం. అమెరికాలో డ్రైవింగ్ ఆపేస్తే పక్షికి రెక్కలు

WE COULDN'T BE MORE EXCITED ABOUT THIS MESSAGE

# Yes, WE ARE GROWING
# Yes, WE ARE HIRING

Even in this economy

To Find Out How You Can Bring Your Career to LIFE Contact me Today



**Thevan Theivakumar**, CLF®

Sr. PARTNER, New Jersey Sales Office

**(732) 744-3763**

ntheivakuma@ft.newyorklife.com

**www.ThevanTheivakumar.com**

EOE.M/F/D/V

WE STAND STRONG

JOIN OUR TEAM

NEW YORK LIFE

The Company You Keep®

New York Life Insurance Company 399 Thornall Street, 7th Floor Edison, NJ 08837

కొట్టేసినట్టే. రోజు చేసే డ్రైవింగ్ లో చేసే తప్పుల గురించి తమకు తామే ఆలోచించుకోవాలి. చిన్న తప్పులను కూడా ఎందుకలా జరిగిందో అర్ధం చేసుకొని సరిదిద్దుకోవాలి. ఎన్నేళ్ళు డ్రైవింగ్ చేసినా మళ్లీ డిఫెన్సివ్ డ్రైవింగ్ కోర్స్ తీసుకొనవచ్చు. ఇన్ని జాగ్రత్తలు ఎం దుకని? ఎందుకంటే, ఒక చిన్న ఏక్సిడెంట్ అయినాసరే వయ సు పైబడుతున్న డ్రైవర్ తన లైసెన్స్-ని పోగొట్టుకునే అవకాశం వుంది. అప్పుడు మనం మన పిల్లలు, స్నేహితుల మీద, సీని యర్ సిటిజెన్ సర్వీసెస్ మీద ఆధార పడవలసి వుంటుంది. ఏదో వయసుకి ఇల్లాంటి పరిస్థితి వస్తుంది. కాని, ఆ పరిస్థితి 90, 100 సంవత్సరాలు వచ్చేదాకా రాకూడదని ఆశపడదాం.

## మళ్ళీ మళ్ళీ మాయాబజార్

డా. యేలూరిపాటి అపర్ణ, న్యూజెర్సీ

తెలుగు సాహితీ సమాఖ్య వారి ముప్పైవ వార్షికోత్వానికి వేసే సావనీర్ కి ఏమి వ్యాసం రాయాలా అని ఆలోచిస్తూ ఇంటికి వచ్చాను. కొత్తగా కొన్న నా సెల్ ఫోన్ లో దూరం నుంచే అంటే పార్కింగ్-లాట్ లోంచే, ఒక ప్రోగ్రాం సెలెక్ట్ చేస్తే ఆ ప్రోగ్రాం ఇంట్లో ఉన్న టి.వి. లో వచ్చే అవకాశం ఉంది. ఆ రోజు మావారికి సెలవు ఉండడంతో టి.వి. లో ఏదో ఒక సినిమానో, ప్రోగ్రాంనో సీరియస్ గా చూస్తూ ఉంటారని తెలుసు. ఆయన్ని ఆటపట్టించడం కోసం నేను అప్పుడప్పుడూ వేరేది ఏదో సెలెక్ట్ చేసి, ఇంట్లోకి వస్తూ ఉంటాను. అలా ఆ రోజుకూడా ఫోన్ లో నుంచి ఏదన్నా పెడదామని చూ స్తూంటే మాయాబజార్ కనబడింది లిస్టులో. సరే అని సెలెక్ట్ చేసి ఇంట్లోకి వచ్చి చూద్దును కదా, అది తెలుగు సినిమా కాదు. తమిళ్ మాయాబజార్. కాసేపు వినేసరికి ఒక్క ముక్క కూడా అర్థం కాక, సంతలో అమ్మను మిస్ అయిన చంటిపిల్లాడి తంతు అయ్యింది. ఏది ఏమైనా, మాతృభాషకి సాటి లేదు అని మరొకసారి అర్థమై, తెలుగు మాయాబజార్ పెట్టుకుని మొత్తమంతా పూర్తిగా చూశాం. కొత్త కలర్ సినిమా కాదండోయ్. ప.. ప.. ప .. పాత మాయాబజార్.

చూస్తున్న కొద్దీ ఎప్పట్లాగానే ఏదో కడుపునిండా విందు భోజనం చేసిన తృప్తి, చాలా కాలానికి పుట్టింటికి వెళ్ళినంత ఆనందం కలిగాయి. అసలు చిన్నప్పటి నుంచీ ఈ సినిమా ఆల్ టైం ఫేవరేట్ మా ఇంట్లో అందరికీ. మాకే కాదు, సుమారు నూటికి తొంభై మంది ఇలాగే ఫీలవుతారని నా విశ్వాసం. ఆ సినిమాలో - ఉమ్మడి కుటుంబంలో తరచుగా కనిపించే వదినా మరదళ్ళ దెప్పు ళ్ళు, మాటకిమాట అంటించడాలు, మూతివిరుపులు, బావామరద


**With Best Compliments from:**

Cosmic
Stone & Tile Distributors

502 (formerly 475) Jersey Avenue, New Brunswick, NJ 08901
Tel: (732) 937 5400 Fax: (732) 937 6969 www.cosmicstone.com

*Wholesale distributors of:*

*Slabs & Tiles:*
Granite, Marble, Onyx
Glass & Jade
Limestone, Travertine & Quartzite
Silestone

*Tiles:*
Polished Porcelain & Glazed Porcelain
Ceramic & Concrete
Limestone & Travertine
Engineered Stone

*New Jersey's Sole Distributor for:*
SILESTONE
*Also available are beautiful mosaics, chair rails, bullnose and medallions!*

ళ్ళ సరసాలు, సరదాలు, ఆట పట్టించుకోవడాలు, ఇంకా, పేరంటాళ్ళ పాటలు, పెళ్లి కూతుర్ని చెయ్యడం, పెళ్ళివారికి విడిది సత్కారాలు, పిండివంటలు, పెళ్లి వేడుకలు. ఒకటేమిటి బయట జరిగే అన్ని విశేషాలు అందులో ఉన్నాయి. అసలు ఆసినిమానే ఒక విక్కీ-పీడియా, ఒక విజ్ఞానసర్వస్వంలా ఉంటుంది. ఈ సినిమాకి సంగీతం, సాహిత్యం, మాటలు, ఫోటోగ్రఫీ అన్నీ గొప్పవే. మనం ఏ కోణంలో చూసినా, ఎన్నో విశేషాలు కనబడతాయి ఈ సినిమాలో. ఒక మంచి రీసెర్చ్ టాపిక్ మాయాబజార్ అంటే అతిశయోక్తి ఎంత మాత్రం లేదు.అందుకే, ఫిలిం ఇన్స్టిట్యూట్లలో ఇంచుమించు అన్ని విభాగాల విద్యార్థులకీ పాఠ్య చిత్రంగా ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది మన మాయాబజార్.

మొట్టమొదటి పుట్టిన రోజు పేరంటం సీన్ లో పెద్దల దీవనలు, తర్వాత బాణవిద్యా ప్రదర్శనం సమయంలో పిల్లల పంతాలు, అది అవ్వగానే అన్నగారు మేనల్లుడి పరాక్రమానికి మెచ్చి చెల్లికి కూతుర్ని కోడలిగా చేస్తానని మాట ఇవ్వడం, తర్వాత సుభద్ర, అభిమాన్యుల ప్రయాణం ఇలా కథకి చకచకా సాగిపోతుంది. రేవతీదేవిలో 'ఇంకా కొత్తగా అడిగేదేమిటి వాళ్ళు పుట్టినప్పుడే భార్యాభర్తలు అనుకున్నాము కదా' అన్నప్పుడు గడుసు ఇల్లాలి తెలివితేటలు, 'అక్కడకి వెళ్ళాక ఆ వైభవంలో మమ్మల్ని మర్చిపోతావేమో' అని సుభద్రతో అన్నప్పుడు ఆడపడుచు సౌభాగ్యం అంటే కొంచెం అసూయతో పాటు, కూతుర్ని అంత పెద్దింటికి కోడలుగా పంపుతాను అనే ఆనందం, గర్వం, సంతృప్తి అన్నీ ఆవిడ మొహంలో తన్నుకొచ్చేస్తాయి. 'ఇప్పుడైతే ఇంత తేలిగ్గా అన్నావు కాని, ఆ రోజు వచ్చినపుడు ఇంతకన్నా కచ్చితంగా అడుగుతావులే' అన్నప్పుడు కూతుర్ని అత్తవారింటికి పంపే సమయం తలుచుకొంటే తల్లికి కలిగే ఒక చిన్నపాటి బాధ, ఆవిడ ప్రియదర్శినిలో చూసినప్పుడు ఎన్నో రత్నరాశులు, మణి మాణిక్యాలు కనబడడం, రుక్మిణి 'ఊరికే అలా కనబడవులే అక్కయ్యా' అన్నప్పుడు, 'అయితే, నీవు నా పక్కనే ఉన్నావు, నువ్వు కోరుకున్నది నాకు కనబడిందేమో' అని ఆవేశపడడం, రుక్మిణి చిన్నబుచ్చుకోవడం, కృష్ణుడు 'కావచ్చు' అని సద్ది చెప్పడం, ఇవన్నీ కుటుంబాల్లో జరిగే చిన్న చిన్న గొడవల్ని గుర్తు చేస్తాయి.

పాండవులను అడుగడుగునా తలచుకునే ఈ సినిమాలో అసలు వాళ్ళ పాత్రే లేకపోవడం వాళ్ళ ప్రసక్తి "కనిపించకుండా వినిపించడం" విచిత్రమైనా, ఆ లోటు ఎక్కడా కనబడదు. ఐతే, పాండవులు రాజ్యాన్ని కోల్పోయి అడవులకు వెళ్ళిన సందర్భంగా సుభద్ర, అభిమన్యులు ద్వారకకు చేరిన సమయంలో ఆడ పడుచును చూడడానికి రాకుండా రేవతీదేవి వేసిన ఎత్తులు, 'ఏ ఇంటికి వెళ్ళినా నాకు ఆ పట్టింపు ఏమీ లేదు' అంటూ ఐశ్వరాన్ని కోల్పోయిన ఆడపడుచును చిన్న చూపు చూడడం, ఎక్కడ ఉన్నా మా వైభోగాలకు ఏమీ లోటు లేదు' అని సుభద్ర తిప్పి కొట్టడం, 'చెడి పుట్టింటికి రాకూడదంటూ' బాధ పడడం, ఆ సమయంలో రుక్మిణి ఓదార్చడం, ఒక కుటుంబవాతావరణాన్ని కళ్ళకి కట్టిస్తాయి.

శకుని చేసే బోధలు, పాండవుల్ని ఓడించడానికి చేసే ఆలోచనలు, లక్ష్మణకుమారుణ్ణి పెళ్ళికి ఒప్పించడానికి అభిమన్యుణ్ణి గుర్తు చెయ్యడం, ఇవన్నీ ఒక లౌక్యం, కుళ్ళుబోతుతనం, అసూయ కలగలిసిన సగటు తెలుగు సినిమా విలనీ కనబడుతుంది. మిస్సమ్మ సినిమాలో రమణా రెడ్డి పాత్ర కి ఈ పౌరాణికపాత్ర ఏ మాత్రం తీసిపోదు. శశిరేఖ ధోరణి చూసి దుర్యోధన ధర్మపత్ని కంగారు పడుతుంటే సద్ది చెప్పిన విధానం ఒక లౌక్యుడైన, మేధావి అయిన పెద్దమనిషిని మన ముందు నిలబెడతాయి.

కృష్ణుడు తెలివైన, సమర్థుడైన, కుటుంబానికి మూల స్తంభమైన వ్యవహర్త. అన్నను, వదినను నొప్పించకుండా, అన్న కూతుర్ని బాధ పడనివ్వకుండా, చెల్లిని, మేనల్లుడిని కాచుకొంటూ, సరి అయిన సమయానికి సరి అయిన సలహా చెప్పగలిగే సమర్థుడిగా, చక్కని పాత్రచిత్రణ జరిగింది. నౌకాయానం సమయంలో శశిరేఖ, అభిమన్యులను తప్పించిన విధానం ఊహాతీతం. అన్నగా, తమ్ముడిగా, భర్తగా, మేనమామగా, బాబాయిగా, కష్టసుఖాల్లో అండగా ఉండే మంచి అన్నగా, అడుగడుగునా ఆ పాత్ర ప్రత్యేకత కనబడుతుంది.

ఘటోత్కచుడు అమ్మ మాట వినే బుద్ధిమంతుడు, సైన్యానికి నాయకుడు, సమయస్ఫూర్తి, పరాక్రమం, హాస్య చతురత ఉన్నవాడు. ఎవరూ 'పుట్టించకుండా మాటలు ఎలా పుడతాయి' అనే భాషాభ్యుదయవాది. ఐనవాళ్ళ పట్ల ఎంత అనురాగం

కనబరుస్తాడో, అలాగే శత్రువులను విడివిడిగా, పొడిపొడిగా, ముక్కముక్కలు చెయ్యాలనే విషయంలో అంత పట్టుదలా ఉన్న వాడు. తన అనుచరులకు భాషాజ్ఞానం కన్నా, విషయ జ్ఞానం ముఖ్యమనే ఆదర్శవాది. అతని అనుచరులు కూడా' శాస్త్రం సొంత తెలివి లేని వాళ్ళకోసమనీ, సౌకర్యం ముఖ్యమనీ' గురువుకే బోధించే విప్లవవీరులు. తమను ఏడిపించాలని ప్రయత్నించిన పెళ్ళివారినే ముప్పతిప్పలు పెట్టగలిగిన మేధావులు.

శశిరేఖగా సావిత్రి అభినయం, తల్లి చాటు పిల్లగా, బావను ఇష్టపడే ప్రేమికురాలిగా, పెద్దలను ఎదిరించలేని ముగ్ధలా ఎంత బాగా చేసిందో, ఘటోత్కచుడుగా లక్ష్మణకుమారుని ఏడిపించడం, పెళ్లి కూతురుగా అలంకరిస్తున్నప్పుడు వెటకారంగా నవ్వుకోవడం, అహ నా పెళ్ళియంట పాటలో, సుందరి నీ వంటి దివ్య స్వరూప ము పాటలో అభినయం, న భూతో న భవిష్యతి. ఎవరో చెప్పినట్టు, ఆ సినిమాకి హీరో సావిత్రి.

బలరాముడుగా గుమ్మడిని తప్ప మరొకరిని ఊహించడం కూడా కుదరదు. చెల్లికి మాట ఇచ్చినప్పుడు ఎంత ప్రేమ కన బరిచాడో, దుర్యోధనుణ్ణి మందలించాలని వెళ్ళినప్పుడు ఎంత కోపంగా వెళ్ళాడో, చివరికి వాళ్ళ మర్యాదలకి, అడుగులకి ఒత్తిన మడుగులకి అంతగానే లొంగిపోయాడు. వాళ్ళ దొంగ వినయాలకి ఎంత కరిగిపోయాడంటే, చెల్లికి ఇచ్చిన మాట, కూతురి భవిష్యత్తు సర్వం మరిచిపోయి, మాట ఇచ్చేశాడు. ఇంత బోళామనుషులకీ ఈ రోజుల్లోనూ కొదవలేదు.

ద్వారక వచ్చిన ఘటోత్కచుణ్ణి కృష్ణుడు ఏడిపించడం, ఘటోత్కచుడు పిండివంటలన్నీ తినెయ్యడం, పెళ్ళివారికి చేసిన విడిది ఏర్పాట్లు, కంబళీ, గింబళీ, తల్పం-గిల్పం ఇవన్నీ పిన్నల ను, పెద్దలను కూడా సమానంగా అలరించే ఘట్టాలు. ఇప్పటికీ ప్రతి పెళ్లిలోనూ వివాహ భోజనంబు పాట వాయించని మంగళ వాయిద్యం పూర్తికాదు. ఇంక, సందర్భోచితంగా కృష్ణలీలలు, భస్మాసురవధలను కూడా రసవత్తరంగా చూపించారు.

ఇంక ఆధునిక టెక్నాలజీ పరంగా చూస్తే, మనం ఇప్పుడు చూసే స్కైప్, వీడియో చాట్ మాత్రమే కాదు, కొత్తగా వస్తున్న స్మార్ట్ ఫోన్ లో ఉన్న తమాషాలు, సౌకర్యాలు అన్నీ ప్రియదర్శినిలో ఉన్నట్టు కనబడతాయి. కోరుకున్నవారు కనబడి మాట్లాడడం, ఇష్టమైనవన్నీ కనబడడం అబ్బో అనిపించే అబ్బు


This Page is sponsored by Pediatric and adolescent Care Associates

Pediatric and Adolescent Care Associates

**Ravi S. Chennapragada, MD, FAAP**

*Board Certified in Pediatrics*
*Experienced and individualized care*

Daytime, evening, or weekend appointments available

*On call 24 hours a day, 7 days week for emergencies*
*Free pre-natal consultation*
*Most insurance plans accepted*

Attending pediatrician at:
*Robert Wood Johnson University Hospital ▪ St. Peter's Medical Center*
*JFK Medical Center ▪ Somerset Medical Center*

▪ *Two convenient locations* ▪

*676 Route 202-206 North, Building 2*
*Bridgewater, New Jersey*
*(908) 927-1155*

*1667 Oak Tree Road*
*Edison, New Jersey*
*(908) 927-1155*

రం. ఇంక సత్యపీఠం పోలీసులు ఉపయోగించే లై డిటెక్టర్ కు మరో రూపం. శశిరేఖను ఘటోత్కచుడు తన ఆశ్రమానికి తీసుకుపోయినప్పటి హంసతూలికా తల్పం ఆధునిక హెలికాప్టర్ కి ఆది రూపమే.

ఇలా ఎంత తవ్వినా తరగని నిధులున్న మన మాయా బజార్ ఇంచుమించు షష్టిపూర్తికి దగ్గరవుతున్నా, ఇప్పుడే మార్కెట్ లోకి వచ్చిన ఏ సినిమాలకీ తీసిపోని అద్భుతాల గని.

## చివరికి

చంద్ర కన్నెగంటి

వరస వీడ్కోళ్ల పిదప
వెనుదిరిగి మెల్లగా లోపలికి
చలిగాలినీ, చీకటినీ బయటే వదిలేసి

మెచ్చుకోళ్ళు సూటివీ వంకరవీ
నవ్వులు పాపలవీ పెద్దలవీ
ఇంకా తలలో గాల్లో తచ్చాడుతూ

పిల్లల్ని కవ్వించి కవ్వించి
కప్పుకు చేరిన గాలిబుడగలన్నీ
డస్సి నేలపై వెల్లకిలా పడి

అలసి బొమ్మల్లో బొమ్మలల్లే

పిల్లలు పడి నిద్రపోతూ
ఏం చేయాలో తెలీక తెల్లమొహాలేసి
కాగితపు రుమాళ్ళు ఎక్కడివక్కడే
అక్కడక్కడా వదిలిన
సగం నీరూ సగం తిండీ
ఒకదాన్నొకటి ఓదార్చుకుంటూ

అజీర్తితో తేపుతూ చెత్త డబ్బా
తొట్టిలో ముక్కు మూసుకుని
కడగని గిన్నెలూ, ఎంగిలి కంచాలూ

శుభ్రపరిచే భద్రపరిచే
రెండు చేతులకోసం ఎదురుచూస్తూ

( శ్రీ చంద్ర కన్నెగంటి గారి కవిత తెలుగు కళా సమితి 30వ వార్షికోత్సవ సంచికలో ప్రచురించబడింది. అయితే ముద్రణలో పొరపాటు వల్ల కవితలో చివరి రెండు పాదాలూ ప్రింట్ కాలేదు. శ్రీ చంద్ర గారికి క్షమాపణలతో ఈ కవిత పూర్తి పాఠాన్ని మళ్ళీ ప్రచురిస్తున్నాం - దివాకర్ పేరి)

## ప్రధాన మంత్రి

ఆశ, న్యూ జెర్సీ

ఇది రాజకీయ విషయం (పొలిటికల్ సబ్జెక్ట్) కాదు. రాజకీయ శాస్త్రానికి (పొలిటికల్ సైన్సుకు) చెందిన అంశం. సాధారణంగా రాజు మంచిసలహాలను సీకరించగల ఓర్పు గల వాడు, సరైన నిర్ణయం చెయ్యగల సమర్థుడు, నిర్ణయాన్ని కఠినంగా అమలు చేయగల శక్తిమంతుడూ, నిష్పక్షపాతియైన న్యాయానువర్తిగా ఉంటాడు. ప్రధానమంత్రి - పాలితులైన సమస్త ప్రజానీకం యొక్క భావాలను ప్రతిబింబించగల, ప్రభావితం చేయగల సలహాలనిస్తూ, రాజు సరైన నిర్ణయం చేయగలిగేలా తోడ్పడుతూ ఉంటాడు. వీరిద్దరి వ్యక్తిత్వాలను బట్టీ, వ్యక్తిగత సంబంధాలను బట్టీ, అనుబంధాన్ని బట్టీ పాలన ఉత్తమంగానో, అధమంగానో సాగుతూ ఉంటుంది. నేడు కూడా ప్రతీ వ్యక్తీ ఓ సందర్భంలో, సలహాలనిచ్చే స్థితిలోనూ, మరో సందర్భంలో నిర్ణయించే పరిస్థితిలోనో, అంటే మంత్రిగానో

రాజుగానో ఉంటూనే ఉంటాడు. ఆయా సందర్భాలలో మనకు ఆదర్శవంతమైన కొన్ని ఉదాహరణలు మార్గదర్శకాలు అవుతాయి.

ముల్లోకాలనేలే ఇంద్రుడు-బృహస్పతిని సంప్రదించకుండా చేసిన ప్రతి పనితోనూ ఇబ్బంది నెదుర్కొన్నాడు. సలహాలు తీసుకొని అనుసరించిన ప్రతిసారీ ఆపద లోంచి గట్టెక్కాడు. బృహస్పతి నిఖార్సైన ప్రధానమంత్రి.

శుక్రాచార్యుడు తన తపశ్శక్తినంతటినీ ధారబోసినా, మృతసంజీవనిని సృష్టించినా, స్థాయిలేని పాలకులకు గురువు కావటం వల్ల అవన్నీ కొరగాకుండా పోయాయి.

షట్చక్రవర్తుల ప్రధానుల పేర్లు, కథలు మనకు అంతగా తెలియవు కానీ, బహుశః వారి వారి శీలాధిక్యత వల్ల ఆ ఆరుగురు చక్రవర్తులూ చరిత్రలో నిలిచిపోయి ఉండవచ్చు.

ఇక రామాయణ కాలానికి వస్తే, సుమంత్రుడు తన సహచరులైన అష్ట మంత్రుల సామర్థ్య సహకారాలతో దశరథుధునికి మంచి పాలకునిగా పేరు తెచ్చి పెట్టాడు. వశిష్ఠుడు రాజ పురోహితుడే కాక రాణియైన కైకనే మందలించగల అధికారం, అవకాశం కలిగి ఉండి అనేక సందర్భాలలో దశరథునికి మార్గదర్శకునిగా నిలిచాడు.

కష్టకాలంలో ఉన్నప్పుడు కూడా సుగ్రీవుణ్ణి విడిచి పెట్టకుండా, సుఖాలతో ఒళ్ళు మరిచినప్పుడు హెచ్చరిస్తూ, అవసరమైనప్పుడల్లా, శారీరక – బుద్ధి బలాలతో అండగా నిలిచిన మంత్రి హనుమంతుడు.

కొంతమేర చేతులు కాలాక, సలహాలివ్వబోయి రావణుడు వినక పోతే, భయాన్నో భక్తినో అతన్నే అనుసరిస్తూ, అంతరించిన ప్రధాని ప్రహస్తుడు.

ధృతరాష్ట్రుడో, ధర్మజుడో ఎవరు రాజుగా ఉన్నా, ధర్మానుగుణంగా తాను చెప్పదలచుకున్నది తానూ చెబుతూ, నిర్ణయాన్ని రాజుకే వదిలేసిన పరిమితి నెరిగిన ప్రధాని విదురుడు. ఎవరి నిర్ణయాలకు అనుగుణంగా వారు ఫలితమనుభవించారు అనేది భారతగాథ.

సాహితీ సమరాంగణాలలో నొలసిన శ్రీకృష్ణదేవరాయలకు మంత్రాంగంలో వెన్నుదన్ను తిమ్మరుసు. మహారాజుచే 'అప్పాజీ' గా గౌరవించ బడ్డాడు.

అంతఃపుర లీలావినోదాలతో మునిగి తేలుతున్న వత్స రాజు ఉదయనునికి ఎండ పొడ తెలియకుండా కాచుకున్న


THIS PAGE IS SPONSORED BY VENKAIAH DAMA

VENKAIAH DAMA MS PE. CLU. ChFC

143-02 45 AVE. FLUSHING, NY 11355
PHONE: (718) 886 4077 FAX: (718) 886 7007
PHONE®: (718) 762 7173 E-mail: venkaiah.dama@nmfn.com

(In Financial Services since 1976)



TAX SAVINGS and/or DEFERRALS

JOINT COMPLIFE INSURANCES
529 COLLEGE SAVINGS PLAN
FIXED & VARIABLE ANNUITIES
IRAS: REGULAR, ROTH, SEP, SIMPLE & NON-QUALIFIED
KEOGH & CORPORATE PENSION PLANS
REQUIRED MINIMUM DISTRIBUTIONS
FOUR WAYS TO REDUCE CAPTIAL GAIN TAXES




**Asalatha "Asha" Vikuntam**

Realtor Associate



**Community Expert**

**2005 Member of Mercer County Board of Realtors**

**Cranbury Resident since 1999**

**Marketing Specialist**

Century 21

**Abrams, Hutchinson & Associates**

**10 Schalks Crossing Road**
**Plainsboro, NJ 08536**
**609-750-7300**
**Cell Phone 732-470-4717**

మంత్రాంగ నిపుణుడైన ప్రధానమంత్రి యౌగంధరాయణుడు.

అరివీరభయంకరుడైనప్పటికీ, చుట్టూ శత్రువులతో నిరంతరం సతమతయ్యే, ప్రతాపరుద్రునికి నిజమైన అండాదండా యుగంధరుడు.

చంద్రగుప్తుని మహామగధ సామ్రాజ్యాధినేతగా తీర్చి దిద్దిన చాణుక్యుడు తన సమయోచిత నిర్ణయాలతో సమర్థత గల శత్రువర్గంలోని మంత్రి- 'రాక్షసుడి'ని మనసు మార్చి స్వపక్షంలోకి చేర్చిన కౌటిల్యం అమోఘం.

సంఘర్షణమే చరిత్రగా నిరంతర పోరాటమే నిత్యకార్యాచరణగా గల శివాజీ మహారాజుకు సరియైన క్రాంతదర్శి-మార్గదర్శి గురు శ్రీ సమర్ధ రామదాసు.

అధిక సంఖ్యాకులైన పాలితుల అభీష్టాలకు అనుగుణంగా పాలనను సాగించేలా తానీషాకు సహకరించిన అక్కన్న-మాదన్నలు రాజుకు నమ్మినబంటులే కాదు చక్కని మంత్రులు కూడా.

సమకాలీన చరిత్రలో ఎక్కడ చూసినా, సమర్థులైన పాలకుల వెనుక ఉన్న 'టీమ్'లోని వ్యక్తులను గమనిస్తే, పాలకుని సమర్థతకు నిజమైన కారణం బోధపడుతుంది. ఆ 'టీమ్' ని ఎంచుకోవడం, నియమించుకోవడంలోనే పాలకుల సమర్ధత కనబడుతుంది.

ప్రాచీనకాలంలో కొన్నిసార్లు గురువు, మంత్రి కలగలిసి పోతారు. కొన్ని సార్లు విడివడి ఉంటారు. ఆధునిక ప్రజాస్వామ్య యుగంలో 'టీమ్' అనేది ప్రాధాన్యత గల అంశం. అందులోనూ, పదవి లేకపోయినా ప్రతిభావంతులు టీమ్ ని ప్రభావితం చెయ్యటం కద్దు. ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించి, ఉపయోగించుకోవడం పాలకుని ఉత్తమ లక్షణం అయితే, ప్రతిభతో సరియైన నిర్ణయాలకు సహకరించడం ప్రధాని లక్షణం. ప్రధాన సందర్భాలలో ప్రాచీన ఉదాహరణలను, అనుభవాలను ప్రసుతానికి అన్వయించుకోవటం సమర్థతకు, ప్రతిభకు దోహదకారి కావచ్చు. ప్రయత్నిద్దాం.

## అబ్దుల్ కలాం

-అజ్ఞాత రచయిత

అందగాడు కాదు,
ఆజానుబాహుడు కాదు.
ఐశ్వర్య వంతుడు
అంత కన్నా కాదు
అఖండ భారతంలో దుర్భిణి తో వెతికినా
శత్రువు కానరాడు.
ఏమిటయ్యా నీ గొప్పతనం ...
మేరు చిన్నబోయింది.
సిపాయి కాదు - కత్తి పట్టలేదు
క్షాత్రం కను చూపు మేరలో కానరాదు.
రాముడు కాదు- రహీము కాదు
పలుకులు నేర్చిన రామ చిలుకా కాదు.
విల్లంబు లెత్తిన అర్జునుడు కాదు
సారథి కృష్ణుడూ కాదు.
శౌర్యం మాటే లేదు ...
అయిననూ శత్రు దేశాన్ని భయపెట్టని క్షణం లేదు.
ఓడి ఆగింది లేదు - విజయ గర్వం లేదు...
అసలు అలిసిన ఛాయ లేనే లేదు.
కూడ బెట్టింది లేదు - ఆకలి అంటింది లేదు.
పదవీ గర్వం లేదు - పురస్కార వాంఛ పుట్టుకతో లేదు
ఉన్నదంతా లక్ష్య సాధనే.
అంపశయ్య లేదు - ఆసుపత్రి సూది మందు లేదు.
జుట్టు చెదరలేదు -నవ్వు ఆగలేదు.
భవబంధాలు లేవు - భయపడింది లేదు.
ఎక్కడమ్మా ఓ మృత్యు మాతా
నువ్వు గెలిచింది?
ఒక చుక్క కన్నీరు
నువ్వు కూడా రాల్చి ఉంటావు
మాకు తెలియలేదంతే !!

( ఈ కవితను మాకు పంపించిన శ్రీమతి గిరిజ కొల్లూరి గారికి మా కృతజ్ఞతలు.)

# BALACHANDAR JAYARAMAN CPA LLC

**CERTIFIED PUBLIC ACCOUNTANT**
**BUSINESS CONSULTANT**
**719 Inman Avenue, Suite # 201, P.O. Box 117**
**Colonia, NJ 07067**
**www.jayaramancpa.com**

**Email: Bala@JayaramanCPA.com**
**732-943-7605 (Tel)**
**732-539-0924 (Cell)**
**732-909-7122 (eFax)**

**Member: AICPA**
**Member: NJSCPA**
**Licensed as CPA in NJ & IL**





**Free Initial Consultation** **Low Cost / High Quality Service**

## Prompt & Individual Attention by a CPA

**On-Time Performance** **High Customer Satisfaction**

- *Tax Planning, Preparation and Representation*
- *Accounting and Auditing Services*
- *New Business Consultation*
- *Financial Statements: Compilations, Reviews & Audits*
- *Sales Tax and Payroll Tax Returns*
- *Financial and Compliance Services for Government Programs*

*For Corporations, Partnerships, Individuals, LLC/ LLP & Non-Profits*

*CALL BALA JAYARAMAN CPA @ 732-943-7605*

# అక్షరవాచస్పతి దాశరథి రంగాచార్య

డా. తన్నీరు కళ్యాణ్ కుమార్ , తెనాలి (ఇండియా)

తొలితరం ఉద్యమ రచయిత, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, అక్షర వాచస్పతి దాశరథి రంగాచార్యులు అస్తమయం తెలుగు జాతి ప్రజలకు - సాహిత్యానికి తీరని లోటు. వేదం నుంచి ఉద్యమం దాకా దగ్గరగా లోతుగా పరిశీలించి రచనలు చేసిన విలక్షణ రచయిత రంగాచార్య. బాల్యం నుంచి చివరి శ్వాస దాకా వివిధ సాహితీ ప్రక్రియల్లో ఆయన రచనలు చేశారు. రంగాచార్య జీవితం భిన్న వైరుధ్యాల నిలయం. ఉత్తర, దక్షిణ ధ్రువాల్లా ఉండే అంశాలు ఆయనలో ఒక్కటిగా కలిసి కాపురం చేస్తాయి. ఆయనను చూస్తే, నిజాం నవాబుకు వ్యతిరేకంగా సాగిన పోరులో తుపాకీ పట్టిన యోధుడని, ఆయన నుదిటి పై కనిపించే తిరునామాలు చూసి ఆయనొక మార్క్సిస్ట్ అని ఎవరూ అనుకోరు. రంగాచార్య సంప్రదాయాన్ని ఎంతగా ప్రేమించారో, సంప్రదాయాన్ని కూడా అంతే ఇష్టపడతారు. భిన్నత్వంలో ఏకత్వం అనే భారతీయ దృక్పథానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన దాశరథి రంగాచార్య స్వాతంత్ర్య సమర యోధునిగా, అక్షర బ్రహ్మగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు.

వరంగల్ జిల్లా చిన్న గూడూరులో 1928 ఆగష్టు 24న జన్మించిన రంగాచార్య హైస్కూల్లో చదువుకునే రోజుల్లోనే ఉద్యమ బాట పట్టారు. 'అధ్యయనం – పోరాటం' అనే నినాదానికి ఆయన అక్షర సాక్షి. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అంటూ నినదించిన దాశరథి కృష్ణమాచార్యులు ఆయనకు అన్న. తెలంగాణ వేదనను, వీరత్వాన్ని దాశరథి సోదరులు స్వయంగా అనుభవించి సాహిత్యంలో పలవరించారు. ఆంధ్ర మహాసభ, ఆర్య సమాజం ప్రేరణతో అన్నయ్య నైజాం సంస్థానానికి వ్యతిరేకంగా ఉద్యమ బాట పట్టగా, తమ్ముడూ అదే బాటలో అడుగులు కదిపారు. తండ్రి సనాతనవాది అయినా అన్నయ్య సాంగత్యంలో రంగాచార్య అభ్యుదయ పంథా తొక్కారు. నేరుగా సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. పగలు బడిలో పిల్లలకు పాఠాలు చెబుతూనే, రాత్రుళ్ళు రైతు కూలీలకు ఉద్యమ బోధన చేసేవారు. ఇంతలో అన్న కృష్ణమాచార్య జైలు పాలుకావడంతో ఇంటి బాధ్యతలన్నీ రంగాచార్య మోయాల్సి వచ్చింది. కుటుంబం ఉద్యమ ప్రభావంలోకి వెళ్ళడాన్ని తండ్రి వెంకటాచార్యులు తట్టుకోలేక భార్యబిడ్డలను వదిలేసి వెళ్ళిపోయారు. బతుకు తెరువు కోసం తల్లి వెంకటమ్మ హరికథలు చెబితే, రంగాచార్యులు లైబ్రేరియన్ గా పనిచేశారు. ఉద్యమం చివరి దశకు చేరుకున్న సమయంలో రజాకార్లు పెట్రేగిపోయారు. ఉద్యమ నేపథ్యం కలిగిన దాశరథి కుటుంబంపై దాడులు చేశారు. ఈ సమయంలో అజ్ఞాతంలోకి వెళ్ళిన రంగాచార్య తుపాకీ పేల్చడంలోశిక్షణ తీసుకున్నారు. తుపాకీ గుండ్లకు గుండెలనడ్డి రజాకార్లను ఎదుర్కొన్నారు. 1948 సెప్టెంబరు 16న పోలీస్ యాక్షన్ తరువాత రంగాచార్య ఉద్యమం నుండి బయటకు వచ్చారు. స్వాతంత్ర్యం తర్వాత ప్రజలను పీడించిన దొరలే ఖద్దరు, గాంధీ టోపీ ధరించి రాజకీయ నాయకులుగా అవతారమెత్తారు. రంగాచార్య వారి మధ్య ఇమడలేక పోయారు. స్వయంకృషితో చదువుకొని 1951లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు. తరువాత 1957లో సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో చేరి 1988లో అసిస్టెంట్ కమీషనర్ గా రిటైరయ్యారు. మారేడ్ పల్లి మున్సిపల్ ప్లే గ్రౌండ్ పక్కన ఉన్న ఇరుకైన సందులోని మూడు గదుల ఇల్లు ఆయన గడిపిన సాధారణ జీవితానికి అద్దం పడుతుంది.

"నేను కత్తీ, డాలూ పట్టుకోలేను. సాయుధుడనై ఎదిరించలేను. నా పెన్నే నా గన్ను" అని చాటిన ఘనపాటి దాశరథి రంగాచార్యులు. ఆయన తన రచనల ద్వారా ప్రజల్ని మేల్కొపడానికి, అన్యాయాన్ని ఎదిరించేలా పురుగొల్పడానికి ఇష్టపడేవారు. తెలంగాణ సాయుధ పోరాటానికి రంగాచార్య రచనలు ఎంతగానో దోహదం చేశాయి. లక్ష్యశుద్ధితో ఆయన తన రచనలు కొనసాగించారు. దాశరథి రంగాచార్య సాహితీ సేవ విలక్షణమైనది, విస్తృతమైనది, విభిన్నమైనది. రంగాచార్య రచనలు భావోద్రేకాలు రగిలించేకన్నా, భావోద్వేగాలు కలిగిస్తాయి. మహారచయిత వట్టికోట ఆళ్వారుస్వామి రచనలు ఆయనను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఆళ్వారు స్వామి వదిలి వెళ్ళిన రచనా ఉద్యమాన్ని రంగాచార్య తన భుజ స్కంధాలపై వేసుకున్నారు. ఆయన సనదైన పద్ధతిలో

తెలంగాణ ప్రజల జీవన చిత్రణ కోసం నవలా రచనకు పూనుకున్నారు.

రంగాచార్య మొత్తం 9 నవలలు రాశారు. వీటిలో 'చిల్లరదేవుళ్ళు', 'మోదుగుపూలు', 'జనపదం' నవలలు పిరీయాడిక్ నవలలు కావడంతో ఒక నవల ముగింపు మరో నవలకు ప్రారంభం అవుతుంది. ఆయన తన తొలి నవల 'చిల్లరదేవుళ్ళు'ను 1969లో వెలువరించారు. తెలంగాణ గురించి తెలంగాణ మాడలికంలో రాసి న నవల కావడంతో ఈ నవలకు విశేష ఆదరణ లభించింది. మొదటి నవలకే రంగాచార్య కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి అందుకున్నారు. దాశరథి రంగాచార్య తెలంగాణ సాయుధ పోరాటం లో పాల్గొన్నారు. సాయుధ పోరాటం నాటి వాతావరణాన్ని, ఆ కాలంలోని బానిస పరిస్థితులను ఈ నవలలో విస్పష్టంగా ప్రస్ఫుటీ కరించారు. గార్ల ప్రాంతంలోని జాగీర్దార్ల దాష్టికాలను ఈ నవలలో కళ్ళకు కట్టించారు. ఈ నవలలోని పీరిగాడు, పాణిమంజరి, ఇందిర పాత్రలు ఆనాటి సమాజంలోని ప్రజలకు ప్రతినిధులు. ఈ నవల 1974లో చలన చిత్రంగా వచ్చింది. 'చిల్లరదేవుళ్ళు' 1938కి పూర్వ పు తెలంగాణ ప్రజల జీవనాన్ని చిత్రిస్తే, తెలంగాణ సాయుధ పోరాటంలోని 1942-48 సంవత్సరాల మధ్య కాలాన్ని 'మోదుగుపూలు' నవల వర్ణిస్తుంది. రంగాచార్య నిర్వహించిన పోరాట చిత్రణమే ఈ నవలలోని ఇతివృత్తం. ఈ నవల చదివే చంద్ర రాజేశ్వరరావు రంగాచార్యను 'ఆంధ్ర గోర్కీ'గా అభివర్ణించారు. 'చిల్లరదేవుళ్ళు', 'మోదుగుపూలు' వంటి నవల్లో తెలంగాణ పలుకుబడులను-నుడికారాన్ని పలికించారు.స్వాతంత్ర్యం తరువాత రెండు దశాబ్దాల సుదీర్ఘ కాలాన్ని 'జనపదం' నవలలోచిత్రించారు.

నగర సమస్యల ఇతివృత్తంతో 'మాయాజలతారు' నవల రాశారు. దేశంలో సామ్యవాద స్థాపన జరుగుతుందన్న ఆశలను - ఆశయాలను 'రానున్నది ఏది నిజం' నవలలో చిత్రించారు. మతాలు వెలసిపోయే రంగులని, మానవత నిరంతరం నిలిచే వుండే ఘనతని సందేశాన్నిస్తూ 'మానవత' నవల వ్రాయబడింది. ఒక బ్రాహ్మణునికి, ఒక దళితునికి మధ్య స్నేహాన్ని కల్పించి, మానవత్వం దైవత్వానికి అతి దగ్గరని 'శరతల్పం' నవలలో నిరూపించారు. స్వాతంత్ర్యం తరువాత కూడా ఆ స్వాతంత్ర్యపు వెలుగులు ప్రసరించని గ్రామాలు ఎలా దోపిడీకి గురయ్యాయో, ఆ


Livingston Pediatrics

*You are our top priority!*

American Academy of Pediatrics

About Us . . . We handle the health care needs of infants, children and adolescents. Prenatal counseling is also available.

We will do our best to see that your child's health needs are served appropriately and quickly. Our practice has an experienced staff available to answer your questions.

Full modern office with electronic medical records.



**Dr. Ramalakshmi Yeramilli, MD**
Member of the AAP,
Board Certified in Pediatrics
Robert Wood Johnson University Hospital
St. Peters University Hospital, New Brunswick

www.livingstonpediatrics.com

**New Patients Welcome!**

**We handle the health care needs of infants, children and adolescents.**

**732-246-7171**
345 Livingston Ave.
New Brunswick, NJ 08901
Fax: 732-246-8974
Habla español, Hindi, Telugu

Office hours:
Monday - Saturday
Evening appts. available
By appointment only

Accepting Most Insurances

దోపిడీలో ప్రజల విషాద జీవితాలు, టీచరమ్మ నుంచి చైతన్యం పొందిన గ్రామస్థులు తిరగబడి విజయం సాధించడం 'పావని' నవల చిత్రిస్తుంది. వీటి తరువాత రంగాచార్య దృష్టి సంప్రదాయ సాహిత్యంపై పడింది.

భారతం, వేదాలు, ఉపనిషత్తులు అనువదించిన తరువాత మళ్ళీ నవలా రచనకు ఉపక్రమించారు. ప్రపంచీకరణ, పారిశ్రామీకరణ ప్రభావంతో మరణంవైపు పయనిస్తున్న ప్రజలకుఅమృతం వైపు పయనింపజేసే 'అమృతంగమయ' నవల రాశారు. ఇందులో భారతీయ తాత్త్వికత, దాని గొప్పదనం, ఆంగ్లేయులు దాన్ని ధ్వంసం చేసిన విధానం, భారతీయ సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం తదితర అంశాలను ఆ నవల చర్చిస్తుంది. సుదీర్ఘ తెలంగాణ సామాజిక పరిణామాలను తన రచనల్లో ప్రతిబింబించిన రంగాచార్య తన ఆత్మకథను 'జీవనయానం' పేరుతో రాశారు. మౌలికంగా ఈ రచన ఆయన స్వీయచరిత్రే అయినా పాఠకులకు ఎక్కడా స్వోత్కర్ష కనపడదు. తానేమిటో చెప్పేకన్నా, ఒక రచయితగా తన బాధ్యత ఏమిటో జీవనయాత్రలో అవగతం చేశారు. ఈ రచనలో రంగాచార్య తన జీవింతంలో పాటు, ఏడి దశాబ్దాల తెలుగు జాతి జీవనాన్ని చిత్రించారు. బుద్ధుని జీవిత చరిత్రను 'బుద్ధ భానుడు' పేరుతో అపురూపమైన రచనను 2010 సంవత్సరంలో వెలువరించారు. రంగాచార్య నవలలు ఎక్కువగా వ్రాసినా తెలుగు సాహిత్య ప్రక్రియల్లో కథా సాహిత్యం అంటే ఆయనకెంతో అభిమానం. రంగాచార్య చేతి నుండి జాలువారిన కథా సంపుటి 'నల్లవాగు'. సమర సాహిత్యానికి చెందిన 'రణరంగం', 'రణభేరి', 'జనరంగం' వీరి రచనలే.

తొలుత కమ్యూనిస్ట్ భావజాలంతో ప్రభావితుడైన రంగాచార్య తదనంతరకాలంలో ఆధ్యాత్మికభావాలను అలవర్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన శ్రీమద్రామాయణం, శ్రీ మహాభారతాలను సరళంగా తెలుగులో రచించారు. కాలక్రమంలో వాల్మీకి రామాయణంలో చోటు చేసుకున్న అవాల్మీకాలు లేకుండా అచ్చంగా వాల్మీకి ప్రోక్తమైన రామయణాన్ని 'శ్రీ మద్రామాయణం' పేరుతో తెలుగువారికి వచనంలో అందించారు. రామాయణంలో అక్కడక్కడా రాసిన రంగాచార్య విమర్శనాత్మక అభిప్రాయాలు చదువరులను ఆలోచింపజేస్తాయి. అపరితమైన పరిజ్ఞానాన్ని అందిస్తాయి. 'సీతా చరితం' పేరుతో మరోసారి రామయణాన్ని రాశారు. 1994లో హరివంశ సహిత 'మహా భారతం' రచించారు రామాయణ, మహా భారత రచనల తరువాత 'శ్రీ మద్భాగవతం' రాశారు. ఈ రచనలో రంగాచార్య వ్యాసుణ్ణి అనుసరించినా, పోతన పద్యాల రుచిని పాఠకులకు చూపించారు.

అనంతర కాలంలో తెలుగు సాహిత్య చరిత్రలో తొలిసారిగా నాలుగు వేదాలను తెలుగులోకి అనువదించి 'అభినవ వ్యాసుని'గా ఖ్యాతి గాంచారు. వేదాలను అనువాదం చేయడానికి ముందు ఆయన తన వేషధారణ కూడా మార్చుకున్నారు. పంచె కట్టుకోవడం, చొక్కా వేసుకోకుండా శాలువా కప్పుకోవడం, నుదుట మూడు నామాలు పెట్టుకోవడం చాలా మందిని ఆశ్చర్యపర్చింది. ఆయన జీవితంలో వైరుధ్యంగా కనిపించిన విషయం. దీనికి ఆయన మతం వ్యక్తిగతమైంది. "మార్క్సిజానికి, నా వేషధారణకు, వేదాల అనువాదానికి మధ్య వైరుధ్యమేమీ లేదు" అంటూ నిక్కచ్చిగానే సమాధానమిచ్చారు. ప్రజలకు వేదం అనే నినాదంతో వేద ఉద్యమాన్ని ప్రారంభించి, విజయవంతంగా పూర్తి చాశారు. వేదాలను అందరూ చదువుకునేలా రాస్తావా? అంటూ సంప్రదాయ వాదులు ఫోన్ ల ద్వారా, ఉత్తరాల ద్వారా హెచ్చరించినా ఆయన ఏమాత్రం లెక్క చేయలేదు. వేదావిష్కరణలో ఒక స్త్రీకి, ఒక దళిత యువకునికి వేద ప్రతులను అందించారు. వేదాలను ప్రవేశికగా వేదాలు మానవజాతి అభివృద్ధిపై ఎలాంటి ప్రభావం చూపాయో, నేటి యాంత్రిక నాగరికతకు వేద సాహిత్యంలో ఎటువంటి సమాధానాలు ఉన్నాయో వివరిస్తూ 'వేదం – జీవననాదం' రచించారు. రంగాచార్య వేదరచనను వివరిస్తుంటే రచయితకు ఉండాల్సిన మొదటి అర్హత ఏమిటో అర్థమవుతుంది. సమాజహితం కోసం చేసే ఏ రచనకైనా ధైర్యం ఉండాలని ఆయన మాటల్లో బోధపడుతుంది.

రంగాచార్య జీవితానికి, అనువాదాలకు విడదీయని బంధం ఉంది. ఆయన చిన్నతనంలోనే వారి తండ్రి నిర్వహించిన 'దాశరథి' పత్రిక కోసం అనేక ద్రావిడ గ్రంథాలను అనువదించారు. తరువాత కాలంలో ఆయన సాహితీ జీవితం అనువాదంతోనే ప్రారంభం అయింది. 1940ల్లో కోల్ కతాలో వచ్చిన కరువు రక్కసి గురించి ప్రఖ్యాత భారతీయ ఆంగ్ల రచయిత భవానీ భట్టాచార్య రాసిన నవల 'He who rides a tiger'ను 'దేవుని పేరిట' పేరుతో



For the if in life®
Employee Benefit Plans
Executive Benefit Plans
Pension & Profit Sharing Plans
401(k), 403(b), SEP, 412(i) Plans
Health Insurance
Business Buy Sell Insurance
Commercial Insurance
Life Insurance
Long-Term Care Insurance
Disability Income Insurance
IRA, Roth IRA & Annuities
Retirement Planning
Estate Conservation Strategies
Auto and Home Insurance
MetLife®
One Blue Hill Plaza, 2nd Floor
P.O Box 1666, Pearl River, NY 10965
www.joseph.metlife.com
Tel. : 845-620-3115
Cell. : 845-323-3666
Get a Quote
FREE
George Joseph
Financial Services Representative
Investment Adviser Representative
e-mail: gjoseph@metlife.com
CA Lic.# OE85378
Metropolitan Life Insurance Company(MLIC), New York, NY 10036.
Some health insurance products offered by unaffiliated insurers through the Enterprise General Insurance Agency Inc.(EGA), 300 Davidson Avenue Somerset, NJ 08873-4175.
Securities and investment advisory services offered by MetLife Securities, Inc. (MSI) (member FINRA/SIPC), and a registered investment advisor. Auto and Home insurance offered by Metropolitan Property and Casualty Ins. Co. (Met P&C®) and affiliates, Warwick, RI. MLIC, the EGA, MSI and Met P&C® are MetLife companies.
L1210150024[exp0112][AZ,CA,CT,FL,GA,MA,MD,NC,NJ,NY,OK,PA,TX,VA]

తెలుగులో అనువదించారు. తొలినాళ్ళలో రంగాచార్య పిల్లలకోసం 'వివేకనందుడు', 'మహాత్ముడు', 'కాళిదాసు' అనే మూడు నాటకాలు రచించారు. 1974లో 'శ్రీ వేంకటేశ్వర లీలలు' రచించారు. రంగాచార్య రచనలు పబ్లిషర్లకు లక్ష్మీకటాక్షాన్నిచ్చాయి. ఐతే తాను మాత్రం సరస్వతీ కటాక్షానికే సంతృప్తులైనారు.

రంగాచార్యుల రచనలది విశిష్ట పంథా. మెలోడ్రామాలు సృష్టించడం ఆయన సాహితీ నైజానికి విరుద్ధం. శిల్పాన్ని త్యాగం చేయకుండా చెప్పాల్సిన కథను ఆయన అలవోకగా నడిపించగలరు. యువకళావాహిని ఆయనకు 'అక్షర వాచస్పతి' బిరుదు ప్రధానం చేశారు. రచయిత భావుకత్వానికి ఒక నైజం ఉండాలని ఆయన తరచూ అనేవారు. భావుకత్వానికి నైజం అనే మాట సాహిత్యంలో కొత్త ప్రయోగానికి నాంది పల్కింది. కథలు, నవలల్లోని పాత్రలు పాఠకునికి సన్నిహితమైతమైతేనే ఆ రచన సమాజానికి స్ఫూర్తిదాయకం అవుతుందని దాశరథి విశ్వసించేవారు. ప్రాంతీయ విభేదాలు, కులాలు, మతతత్వ ప్రాతిపదికన రచనలు చేయడం ఆయనకు నచ్చేది కాదు. అన్యాయాలను ఎదుర్కోవడమే రచనల ముఖ్య ఉద్దేశం కావాలని రంగాచార్య దృఢంగా నమ్మేవారు. ఆయన రచనలు చదివిన ప్రతి పాఠకుడూ తనను తాను పరిశీలించుకునే అవకాశం కలుగుతుంది. అటువంటి సాహిత్యమే సజీవంగా నిలుస్తుంది.

రంగాచార్య వెలువరించిన సారస్వతాంబుధిలో సాహితీవేత్తల కు సాహిత్య రత్నాలు లభిస్తాయి. చరిత్రకారులకు తెలంగాణ చరిత్ర దర్శినమిస్తుంది. మానవత్వమే ఆయన నమ్మిన మతం. ఆయన వేదం...జన జీవన నాదం. ఆయన రచనలు మట్టి బతుకుల అక్షర చిత్రాలు.నిరంకుశంపై అంకుశం రంగాచార్య కలం. ఆయన ఒక కథ రాసినా, ఒక నవల రాసినా, అది తిరుగుబాటు బావుటాయే. అది ముమ్మాటికీ సామాన్యుడి గొంతుకే. అందుకే కాటోలు సామన్యుల నడుమ సామాన్యుడిగానే తుదిశ్వాస దాకా ఆయన బతికారు. చిరకాలం బతికుంటారు. అందుకే దాశరథి నిజంగా కరుణాపయోనిధి!








**AAA CHECKER**



**Airport taxi & Limo Service**

**CALL (732) 486-5161; (732) 689-0161**

**WWW.AAACHECKER.COM**

**aaachecker@gmail.com**

**Pickup / drop-off to EWR, JFK and LaGuardia**

**(Telugu speaking drivers available - 10 % discount for TFAS members)**

## అరుణోదయము

శ్రీనివాస్ గుంటూరి. న్యూ-హోప్, పెన్సిల్వేనియా

అరుణోదయ సమయమరుదెంచెనంతట
శరణుచొచ్చిరి దిశాచలపతులిలనన్
నిశాచరవశము దప్పింపమని అర్ధింపంగన్
వెడలెనుదయభానుడతివెగమునన్

అధిరోహించెనధితినంతట సువర్ణారజతేజ
స్వాలంక్రుతా సౌరధమున్,శరణాగతపరుడై
కవియమునదుప త్రుళ్ళిన వింటివోలే
భళ్ళున నురికె సప్తాశ్వాసముల్

ఆనతిగొని దుమికె గాయత్రి, బ్రుహదస్నికా జగత్రిస్త్యుప
అనుస్త్యుప పంక్తులు శరవేగలయాక్రుతాలంఘుముతోడన్
బదలిన తమ తేజో నిశ్వాసములెల్ల సప్త వర్ణములై
వడిగా వెరయగ రస్మిమండలభుతటాలమెల్లన్

పల్కిరి స్వాగతమ్ములు వాలఖిల్యులెల్లరు పుష్ణుని గాంచి
గాత్రము చేసిరి గంధర్వులు, తగు పాత్రము సల్పిరి అప్సరసల్

శకటమునుగాచెనెక్షులు, సవరణ చేయుచుపన్నగముల్
రవితేజమునోర్వలేక మరుగయ్యేనసురనిశాచరులెల్లన్

అలసటబడి స్థిరముగ నిలిచిన మారుతములు
రవిఉనికిని గనినంతనె నిదురలేచి చిరుఆకులచేలనెల్ల
లెమ్మనిపిలిచే మ్రుదువుగ తమవలపుతో తడుముచు
విరివిగ వీచెనంత సకల చరాచరోపరితలమున్

సింధూరారుణ తేజఃకిరణ శోభితాంభోధరముల్
పాషాణస్ఫోటోద్భవ మందాకినీతరంగముల్పోలె
నివ్వెరబడినిలచె త్రుటిఘటికిన్ వర్ధమగు దినకరుని
దేదీప్యమానగగనమండలవ్యాపితాతపముల్గాంచగన్

తలమున మెరయుడి తొలికిరణముల్గాంచి
బహురీతుల గొల్చిరి బ్రాహ్మణులెల్లన్
పదములు పాడగ కోవిలలు ఘనముగ
తనువునసోకినకాంతులతోడ పులకరించెపుడమిన్


# Simhadri M Gupta MD

## Board Certified in Neurology since 1998

**Trained at Mt Sinai Hospital, NY city**
**Subspecialty Neuromuscular disease**

Office Locations

2 Lincoln Highway, Suite 302
Edison, NJ 08820
Telephone: 732-548-1770; 732-548-1778

81 Veronica Avenue, suite 201
Somerset, NJ
Fax 732 548-1772

Languages: English, Telugu, Gujarati, Hindi, Kannada and other translations




**బంగారు కొండ**

శ్రీ ముకుంద రామారావు, హైదరాబాద్ (ఇండియా)

వెలుగు చీకట్లను తాగుతూ
నీడల్ని కొద్దికొద్దిగా తింటూ
ప్రచండ గాలుల్ని సైతం
ధిక్కరిస్తూ
నిబ్బరంగా నిర్భయంగా కొండ

ఆనందంతోనో బాధతోనో
దాని కంటిముందు జరుగుతున్న
అన్నింటికీ మౌన సాక్షి

తవ్వినా చెక్కినా చీల్చినా
గుళ్లూ దేవుళ్లను చేసినా
అసలు లేకుండానే చేసినా
మూగనోము

బయటా లోపలా
ఎంత సంపదుందో
తెలియని తెలుసుకోని మౌని

నీరు సైతం నిర్లక్ష్యంగా
వెక్కిరిస్తూ హొయలుపోతూ
ఎక్కడో సముద్రాన్ని చేరడానికి
దాటుకుంటూ పోతున్నా
చెక్కుచెదరని బుద్ధుడు

సర్వం ధారబోస్తూనో
ధారబోసేందుకు సిద్ధపడో
ఏ ధ్యానంలోనో శతాబ్దాలుగా
కదలక మెదలక కూర్చున్న
నిరంతర ప్రేమమూర్తి
నిర్వికల్ప సమాధిలోని సూఫీ

Matrimonial

Female 23 years, 5'8", B.Tech,. Civil, Senior Engineer, Hyderabad Metro Project, L&T. Future Plan - M.B.A/M.S in USA. Gotram – Lohitasya, Interests - Painting and Movies. Contact - apdm65@gmail.com




**Bayshore Ophthalmology, LLC**





**SUREKHA COLLUR, MD FRCS**
*Board certified Ophthalmologist*
**Fellowship trained in Glaucoma**
NJ Top Docs
New Jersey's Total Healthcare Resource

**MEGGAN C. HEINZ , OD**
*Doctor of Optometry*
**Lic#27OA00597902**
**OM#27OM00040802**

**CATARACT ▪ GLAUCOMA ▪ EYELIDS ▪ PRK ▪ MULTIFOCAL LENS IMPLANTS**
**Femtosecond Laser Assisted Cataract Surgery**

**Visit Our Onsite Optical Shop**
**Evening Hours and Saturdays**
*YOU CAN MAKE APPINTMENTS VIA OUR WEBSITE*
www.bayshoreophthalmology.com

| | | |
|---|---|---|
| We Offer CareCredit Low Monthly Payment Plans | *719 North Beers Street • Holmdel* **732 264 6464** | Like us on Facebook |

## నా టి.వి. సీరియల్ అనుభవం

**పద్మజ వక్కలగడ్డ, మన్రో (న్యూ జెర్సీ)**

నేను మొన్న డిసెంబర్ లో ఇండియా వెళ్ళాను. నా టి.వి. సీరియల్ **అనుభవం** గురించి ఇక్కడ వ్రాస్తున్నాను. భయ పడకండి. తెలుగు **టి.వి. సీరియల్** అంత కాదు. ఒక్క పేజి లోపలే ముగిస్తాను.

మొదట నా గురించి ఒక్క మాట చెబుతాను. నాకు తెలుగు సినిమాలు చూసే అలవాటు చాల ఎక్కువ. ఇది ఈ కథకి చాల ముఖ్యమయిన ఉపోద్ఘాతం. ఇండియాలో ఆడవాళ్లు ఇంటి పనులు కూడా చేయకుండా టి.వి. సీరియల్ చూస్తున్నారట. దీని గురించి చాల సినిమాల్లో కూడా జోవియల్ గా చూపిస్తున్నారు.

ఒక సోమవారం సాయంత్రం మొదలు పెట్టానండి, 'చిన్నారి పెళ్లి కూతురు' అనే టి.వి. సీరియల్ చూడటం. ఈ సీరి యల్ సోమవారం నుండి శుక్రవారం వరకు ప్రతిరోజు సాయంత్రం అరగంట సేపు వస్తుంది. ప్రతి ఎపిసోడ్ కి మధ్యలో రెండు బ్రేక్-లు. ఒక్కొక్క బ్రేక్ లో 5 నిమిషాల పాటు ఏడ్స్. మనందరికీ తెలిసిన విషయమే ఏడ్స్ ఎన్ని ఎక్కువైతే సీరియల్ కి అంత ఆదాయం, అన్ని ఎక్కువ రోజులు సీరియల్ని పొడిగించవచ్చు. తక్కువ ఏడ్స్ అయితే సీరియల్స్ కి తొందరగా ముగింపు వచ్చేస్తుంది, అందుకని ఎన్ని ఏడ్స్ అయినా భరిస్తారు. క్షమించాలి ... చూస్తారు అనాలి అనుకుంటా.

సీరియల్ లో ఓ ఎపిసోడ్ లొ సంక్రాంతి. కుటుంబం మొత్తం బంధువులతో సహా మేడమీదకి వెళ్లి గాలిపటాలు ఎగుర వేస్తూ ఉంటారు. వేరే మేడమీద ఇంకొక కుటుంబం కూడా గాలి పటాలు ఎగుర వేస్తూ ఉంటారు. ఒకటి హీరో మరొకటి హీరోయిన్. ఇటువంటివి ఆనందకరమయిన పండుగ వేడుకలు హీరో గారి కుటుంబంలోనే సరదాగా చూపిస్తారు కదా! అంతే ఆ ఎపిసోడ్ కథ. సోమవారం నాడు సీరియల్లో, యూత్ అందరు సరదాగా గాలిపటాలు ఎగుర వేయటం, పెద్దవారు అందరు చూస్తూ ఆనందిచటం, నడివయసు వాళ్ళు పళ్ళేలలో చిరు తిళ్లు పెట్టటం. ఇది సోమవారం ఎపిసోడ్.

అయ్యో !! గాలిపటాల ఆట అయిపోలేదండి ...

మళ్ళా మంగళవారం సాయంత్రం అవే గాలిపటాలు, అదే మేడమీద ఉన్నారు వాళ్ళు. ఈ ఎపిసోడ్ లో - ఒక చిన్న పిల్ల వాడు 'అన్నయ్యా నువ్వు బావ గాలిపటం కట్ చేయాలి' అంటాడు, ఇంకొక చిన్న పిల్లవాడు, 'లేదు మా అన్నయ్యే మీ అన్నయ్య గాలిపటం కట్ చేస్తాడు' అంటాడు. ఈ ఇద్దరు పిల్లలు కామెంట్స్ చేసినప్పుడల్లా కెమెరా ఒకరి తరువాత ఒకరిగా అక్కడ ఉన్న పది మంది హావభావాలు స్పష్టంగా చూపిస్తుంది. కెమెరామెన్ ఎవరో కానీ, అందరికి న్యాయం చేసాడు అనిపించింది. పిల్లల కామెంట్స్ తో మంగళవారం ఎపిసోడ్ గడిచింది.

మళ్లా బుధవారం సాయంత్రం ఎపిసోడ్ కి సీరియల్లో వాళ్ళు అందరు మేడమీద గాలిపటాలతో సిద్దంగా ఉన్నరు. సీరియల్ చూసే వాళ్ళందరూ కూడా ఎవరి టి.వీ. ముందు వాళ్ళు సిద్దంగా కూర్చునే ఉంటారు అనుకోండి...

బుధవారం ఎపిసోడ్ లొ-ఒక 30 ఏళ్ళావిడ ఒక మామ్మ గారితో 'మామ్మా నీకు ఎవరు గెలుస్తే ఇష్టం' అని అడుగుతుంది. ఇంక ఇద్దరు చిన్న పిల్లలు ఆవిడ దగ్గరకు వచ్చి చెరొక చెయ్యి పట్టుకొని 'మామ్మ నీకు ఎవరు గెలిస్తే ఇష్టమో చెప్పు మామ్మా! ... చెప్పు మామ్మా... 'అంటారు. (పాపం కెమెరామెన్ ప్రతి డైలాగ్ కి అక్కడ ఉన్న పది మంది చేష్టలూ డిటైల్డ్ గా చూపించి అందరికి న్యాయం చేసాడు) అప్పుడు మామ్మగారు అందరిని పరిశీలించి 'నాకు ఇద్దరూ మనుమలేకదా నాకు ఎవరు గెలిచినా సంతోషమే....' అంటుంది.

హమ్మయ్య బుధవారం ఎపిసోడ్ పూర్తయింది.

ఇలాగె గురువారం, శుక్రవారం ఎపిసోడ్ లు కూడా ఒకొ క్క డైలాగ్ తో గడిచి పోయాయి. కాకపోతే అప్పుడప్పుడు కెమెరా విలన్ కుటుంబం (వాళ్ళ ముఖాలు చాలా సీరియస్ గా– ముట ముట లాడుతూ , చిట చిట లాడుతూ వుంటాయి కదా) వాళ్ళ మీదకూడా ఫోకస్ చేయటం జరిగింది.

శుక్రవారం సాయంత్రం సంక్రాంతి గాలిపటాల వేడుక ముగిసింది. సీరియల్ పునర్దర్శనం ... సోమవారం ...

నిజంగా సంక్రాంతిరోజున మనజీవితంలో కూడా కుటుంబం మొత్తం కలిసి గాలిపటాల వేడుక రెండున్నర గంటలకన్నా ఎక్కువ జరుపుకోరేమో! మళ్లీ సోమవారం ఎపిసోడ్ చూసాను.

ఈ సారి విలన్ కుటుంబం. సాడిస్ట్ భర్త చిన్నారి భార్యని, 'వేడిగా పకోడీ చేసి పట్రా' అని గదమాయిస్తాడు. ఆ చిన్నారి భార్య వంటింట్లోకి వెళ్లి సెనగపిండిలో ఉప్పు, కారం వేసి నీళ్ళు పోసి పిండికలపటం, ఈ మధ్యలో బాండీలో నూనె పోసి పొయ్యి వెలిగించటం, నూనె కాగిందో, లేదో చూసి పకోడీ వేయించటం అన్నీ చాల చక్కగా చూపించాడు. (ఈ ఎపిసోడ్ చూసి పకోడీ చేయటం చక్కగా నేర్చుకోవచ్చు – మావూరి వంట టైప్-లొ)

ఇదండీ, నా వారం రోజుల టీ.వీ. సీరియల్ ఎపిసోడ్ ల సారాంశం. ఇలా ఒక్కొక్క ఎపిసోడ్ సాగితే కథ మొత్తం పూర్తి అవ్వటానికి మూడువేల నాలుగువందల ముప్పయి నలుగు ఎపిసోడులు పట్టటంలో ఆశ్చర్యం ఏముంది? తెలుగు సినిమాలు ఎక్కువగా చూసే నేనే సీరియల్స్ గురించి ఇలా అనుకున్నాను అంటే ... మామూలు జనాల సంగతేమిటో ??

**ఒకే మాట**

కొమరగిరి అనంత ప్రమీలా రాణి

నా పేరు పావని, హైద్రాబాదు లో పుట్టి పెరిగాను, మాది పెద్ద కుటుంబం, నాకు ఇద్దరు అక్కలు, ఇద్దరు తముళ్ళు, నేను మూడవ అమ్మాయిని మేము అందరము ఇంచు మించు గా రెండేళ్ళ తేడాతో పుట్టిన వాళ్ళము, నా పెళ్ళి నాటికి అక్కల, తముళ్ళ పేళ్ళిళ్ళు అయిపోయాయి, నా పెళ్ళి కొంచం మన తెలుగు వాళ్ళ స్టాండర్డ్ ప్రకారం లేట్ అయింది! అందరికి పిల్లలు వున్నారు. పెద్ద అక్కకి ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి, రెండవ అక్కకి ఒక అమ్మాయి, ఒక అబ్బాయి, పెద్ద తమ్ముడికి ఇద్దరు అబ్బాయిలు కవల పిల్లల్లు, చిన్న తమ్ముడికి ఒక అమ్మాయి, ఒక అబ్బాయి, నేను ఎం బీ ఏ చేసి ఒక టేలే కమ్యూనికేషన్ కంపెని



హెచ్ ఆర్ డివిజన్ లో పని చేస్తున్నాను, ఇంట్లో బయట కూడా అందరిలో మంచి పేరు తెచ్చుకున్నాను, పది సంవత్సరాల నుంచి జాబ్ చేస్తున్నాను ఏ రకమైన సమస్యలు లేకుండా.అమ్మ, నాన్నగారు తొందర పడుతున్నారు నా పెళ్ళికి, చాలా సంబంధాలు వచ్చాయ్ కాని నేనే అన్నింటికి ఏదో ఒక వంక చేప్పేదాన్ని ఎందుకంటే నేను ప్రమోద్ ని బెంగుళూరులో ఒక కాన్ఫరెన్స్ లో కలిసినప్పుడు అతనంటే నాకు, నేనంటే అతనికి ఇష్టం కలిగింది ( తొలి చూపులో ప్రేమంటారు ... అదే విధంగా జరిగింది మా విషయంలో. ఈ విషయం ఇంట్లో చెప్పటానికి భయపడ్డాను, అందుకే చాల ఏండ్లు చెప్పలేదు. ఒక రోజున అమ్మ నీకు ఎవరైన ఇష్టం వుంటే చెప్పమ్మా అని అడిగితే, ఈ విషయం అమ్మకి నాన్నగారికి చెప్పాను , వాళ్ళు అతని గురించి అతని కుటుంబం గురించి కనుక్కొని, 'కుటుంబం మంచిది, అబ్బాయికి చదువు ఉద్యోగం బాగున్నాయి , ఒక్కడే కోడుకు, ఆస్తి వున్న వారు, అన్ని విధాలా బాగా వుంది ఈ సంబంధం' అని అనుకున్నారు అమ్మా నాన్న గారు , చాలా సంతోష పడ్డారు కూడా.

తరువాత పనులన్ని ఒక దాని వెంట ఒకటి జరగటం, రెండు నెలల్లో మా పెళ్ళి జరిగిపోయింది. ప్రమోద్ తో పెళ్ళి జరిగిన నెల రోజుల్లో నేను ఉద్యోగానికి రాజీనామా చేసి అతనితో బెంగుళూరు వెళ్ళాను. అతను ఒక ఇంజనీరింగు కంపెనీలో పని చేసేవాడు, నేను కూడా అదే కంపెనీలో ఉద్యోగానికి అప్లై చేయ్యటము, ఒక నెల రోజుల్లో ఇంటర్వ్యూ- జాబ్ ఆఫర్ చేయ్యటము అన్ని వెంట వెంట జరిగి పోయాయి. ఆరు నెలల్లో నేను కూడా అదే కంపెనీలో వర్క్ చేయ్యటము మొదలు పెట్టాను . ప్రమోద్ ఒక్కడే కొడుకు, ఇతనికి వెనకా ముందూ ఏవరూ లేరు, పెళ్ళి లో మా చుట్టాలు కొంతమంది మాట్లాడుకుంటూ వుంటే నా చెవుల పడిన విషయము ఏమిటంటే వీళ్ళ కుటుంబం లో వంశపారంపర్యంగా కొంత మందికి పిల్లలు లేరు, వున్న వాళ్ళకి ఒకళ్ళు ఇద్దరు పిల్లలు చాలా వయసు తేడాతో పుట్టటం జరిగింది. కొంతమందికి చాలా గర్భస్రావాలు జరిగాయి. కాని నేను ఈ గోలకి అంత ప్రాముఖ్యత ఇవ్వలేదు, ఇవ్వదలుచుకోలేదు. పిల్లలు పుడితే పుడుతారు లేకపోతే లేదు, ఇందులో ఇంతగా తలకాయ బద్దలు కోట్టుకునేది ఏముంది అని అనుకున్నాను అప్పుడు.

నాలుగేళ్ళ క్రితం నాకు పెళ్ళి అయింది, అప్పుడు నా వయస్సు ముప్పయి ఆరు, ప్రమోద్ వయ్యస్సు నలభై, అప్పుడే కొంతమంది చుట్టాలు పెళ్ళిలో నా వయస్సు గురించి కామెంటు చేయ్యటం విన్నాను, పెళ్ళి ఇంత లేటు అవుతే పిల్లలు పుట్టరని. ఎందుకు ఇంత క్రూరంగా మాట్లాడుతారు అని ఒక్క క్షణం అనిపించిందే కాని నేను ఇటువంటి కామెంట్సు పటించుకోలేదు. 'సంకుచిత మనస్తత్వాలు' అని అనుకున్నాను, ప్రమోద్ నాకన్నా నాలుగేళ్ళు వయస్సులో పెద్ద కదా దాని గురించి ఎవరూ ఎమి కామెంటు చేయ్యలేదు, ఇది విచిత్రం కదా, ఆడ పిల్ల వయసు గురించి అన్నారే కాని మగ వాడి వయసు గురించి ఎవరు ఎమి అనలేదు, ఈ రకమైన లింగభేదం ఎందుకో కదా అనుకున్నాను.

పెళ్ళి అయిన రెండో సంవత్సరము నుంచి అందరూ అడగటమే ఏమిటి ఆలస్యము అని. నవ్వి వూరుకునేదాన్ని. నాకు ప్రమోద్ కి లేని బాధ వీళ్ళ అందరికి ఎందుకో అని అనిపించేది. చుట్టాలు, బయట వాళ్ళు, ఆఫీస్-కోవర్కర్సు అందరూ కూడా ఈ టాపిక్ గురించి మాట్లాడుకుంటున్నారు అన్న సంగతి నాకు, ప్రమోద్ కి కూడా తెలుసు కాని ఈ విషయన్ని మేము మా మధ్యకి రానివ్వలేదు. సమస్య నాలో వున్నా, తనలో వున్నా మేము ఒకరినొకరు తప్పు పట్ట తలుచుకోలేదు! ప్రమోద్ సాధ్యమైనంత వరకు నన్ను ఇటువంటి పరిస్థితుల్నించి నుంచి తప్పిస్తూ వచ్చాడు. ప్రమోద్ చాలా మంచి వాడు, మేము ఇద్దరము ప్రేమగా,తోడుగా, ఒకళ్ళ నోకళ్ళని అర్ధం చేసుకుని ఒడుదుడుకులు లేకుండా ఒకే మాట మీద జీవితం గడుపుతున్నాము. ఇంత మంచిభర్త దొరకటం నా అదృష్టం అని నేను ఎప్పుడు అనుకుంటాను, ఇంత కన్నా నాకు ఏమి కావాలి? ఇదే విధంగా మా జీవితాలని ఒడుదుడుకులు లే కుండా కాపాడు తండ్రి అని మనసులో దేవుడికి దణ్ణం పెట్టుకు న్నాను.

ఒక రోజు మా అత్త గారి దగ్గరినుంచి ఫోను వచ్చింది మా ఇంటికి వస్తున్నట్టు. నేను ప్రమోద్ కలిసి గెస్టు రూం ని క్లీన్ చేసి, రెడీ చేసాము. మా అత్త గారికి నాకు ఏమి సమస్యలు లేవు కలిసి పోయి వుంటాము కనుక ఆవిడ వస్తే నాకేమీ సమస్యలు వుండవు, అందుకని వాళ్ళ రాకకి ఎదురు చూసాను. అనుకున్న రోజున వచ్చారు నా అత్తగారు-మామగారు. కుశల ప్రశ్నలు అయ్యాక

మేము మా ఆఫీసులకి వెళ్ళి పోయాము, ఇట్లా ఒక వారం గడిచింది. ఆదివారం వచ్చింది. వారాంతం కనుక మేము లేటుగా లేచాము, కాలకృత్యాలు తీర్చుకుని కిందికి వచ్చాము. నేను కిచేన్ లోకి వెళ్ళాను కాఫీ, ఇడ్లీ చేయ్యటానికి. ప్రమోద్ కూడా నాతోపాటు వచ్చాడు హెల్ప్ చెయ్యటానికి. ఇడ్లీ, కొబ్బరి పచ్చడీ, కాఫీ తెచ్చి డైనింగ్ టేబుల్ మీద పెట్టి వాళ్ళ నిద్దరిని "బ్రేక్ ఫాస్టు చేద్దాము రండీ" అని పిలిచాను. న్యూస్ పేపర్ తేచ్చుకోవటానికి వరండా లోకి వెళ్ళబోతూ వాళ్ళ నాన్న గారి చేతిలో పేపర్ చూసి వెనక్కి వచ్చాడు ప్రమోద్. అందరం సైలెంటుగానే బ్రేక్ ఫాస్ట్ చేసాము, ఒక రకమైన అన్ఈజీనెస్ వుంది వాతావరణంలో. కారణం నాకు తెలీయ లేదు. వాళ్ళు లివింగ్ రూం లోకి వెళ్ళి కూర్చున్నారు, నేను డిష్-వాషర్ లోడ్ చేసి లివింగ్ రూంలోకి వచ్చి కూర్చున్నాను, అప్పటికే మా మామగారు పేపరు కొనడం ఒక పెద్ద వేస్టు అన్న సబ్జక్టు మీద లెక్చరు ఇస్తున్నారు. అందరితో పాటు నేను కూర్చున్నాను. వున్నట్టుండి మా అత్తగారు "అమ్మా పావని, నువ్వు ఒక సారి డాక్టర్ కి చూపించుకుంటే బాగుంటుందేమో"అని అన్నారు. నేను, ప్రమోద్ ఉలిక్కిపడి, ఒకే సారి ఆవిడ వైపు చూసాము ఎందుకూ అన్నట్లుగా.

"నేను బాగానే వున్నాను కదా? ఇప్పుడు డాక్టర్ ఎందుకూ?" అని అన్నాను.

"పెళ్ళయి నాలుగేళ్ళు అయినా పిల్లలు లేరు కదా. ఒక సారి డాక్టర్ కి చూపించుకుని ఎదైనా సలహా తీసుకో రాదా? తప్పు ఏమిటి"? అని అన్నారు.

నేను జవాబు చేప్పే లోపలే ప్రమోద్ "అమ్మా, నాకు, పావనికి పిల్లలు లేరు అనే బాధ లేదు. పుట్టినప్పుడే పుడతారు, పుట్టక పోయినా మాకు బాధ లేదు. ప్రస్తుత సమాజంలో పిల్లలిని పెంచటం కన్నా, పిల్లలు లేకుండా వుండటమే మంచిది" అని అన్నాడు.

నేను వేరే ఏమి అనలేదు, ప్రమోద్ నన్ను ఇటువంటి సిట్యువెషన్స్ నుంచి ప్రొటెక్ట్ చేస్తూ వుంటాడు ఎప్పుడూ. నీళ్ళు నిండిన కళ్ళతో తన వంక చూసి తనకి కళ్ళతోనే కృతజ్ఞతలు చెప్పాను. తను కూడా నీవు ఏమి బాధ పడకు నేను వున్నాను కదా అని కళ్ళతో అన్నట్టుగా అనిపించింది.అర్ధం చేసుకుని సపోర్టు చేసే భర్త దొరకటం ఎంత అదృష్టం అని అనుకున్నాను.

ఆ రోజు అంతా నిశబ్దంగానే గడిచింది, తరువాత కూడా దీని గురించి ఏవరము మాట్లాడలేదు, ఒక రకమైన నిశబ్దం, ఇంట్లో మనుషులమధ్య. ఇదే విధంగా నడిచింది ఒక వారం. మా అత్తగారి కి మేము ఇస్తున్న సైలేంట్ ట్రీట్ మెంట్ నచ్చినట్టు లేదు. మూడు వారాలు వుందామని వచ్చినవాళ్ళు రెండో వారంలోనే " వెనక్కి వెళ్ళాలి ప్రమోద్. అమ్మా! పావనీ, చాలా పనులు వున్నాయి " అని చెప్పి హైదరాబాదు వెళ్ళిపోయారు. మేము వాళ్ళని వుండమని బలవంతం చేయ్యలేదు. వీళ్ళు వేళ్ళిన ఒక వారం తరువాత అనుకుంటాను మా అమ్మ దగ్గరనుంచి ఫోను వచ్చింది,"పావని మీ అత్తగారు చేప్పినట్టుగా పరీక్షలు చేయించుకోరాదటే? అల్లుడి గారిని కూడా చేయించుకోమని చెప్పు" అని రహస్యం చేప్పినట్టుగా చెప్పింది. మా అత్తగారు మా అమ్మా మాట్లాడుకున్నారన్నమాట అని అనుకున్నాను. ప్రమోద్ వాళ్ళ అమ్మకి ఏమి చేప్పాడో, అదే నేను మా అమ్మకి చేప్పాను, ఈ విషయం గురించి ప్రమోద్ కి చెప్పి తన మనసు పాడు చేయ్యదలుచుకోలేదు, కాని ఈ ఆడవాళ్ళ నోర్లు కట్టించాలి అని అనుకున్నాను

మరునాడు రాత్రి భోజనం చేస్తున్నప్పుడు ప్రమోద్ తో ఈ టాపిక్ గురించి మాట్లాడటం మొదలు పెట్టాను,"ప్రమోద్, అత్తగారు చెప్పినట్లు నేను టెస్టులు చేయించుకుంటాను ఏమంటావు?" అని అడిగాను. సడన్ గా ఇట్లా అడిగేసరికి ప్రమోద్ నిశ్చేష్టుడయ్యాడు. అయినా ముందు-"ఇవన్ని మనకెందుకు పావనీ? మనం సంతోషంగా, హాయిగా లేమా? పిల్లలు లేకపోతే ఎమైంది? ఈ విషయం మర్చిపో. వియ్ ఆర్ ఫైన్ ద వే వియ్ ఆర్" అని డిష్ వాషర్ లోడ్ చేసి, మిగిలిన పదార్థాలు గిన్నెల్లో సద్ది, ఫ్రిజ్ లో పెట్టి, టేబులు తుడిచి, చేతులు కడుక్కుని, టవలుతో తుడుచుకుని వెళ్ళి సోఫాలో కూర్చుని టీవీ ఆన్ చేసి రిమోట్ తో చానల్సు చేంజ్ చేస్తున్నాడు. ఈ లోపల నేను మిగిలిన పని పూర్తిచేసి వచ్చి తన పక్కన కూర్చున్నాను. తను నా చేతిని తన చేతిలోకి తీసుకుని, నా వైపు తిరిగి, "డోంట్ వరీ పావనీ. వేరేవాళ్ళకోసం ఏమి చేయ్యవలసిన అవసరము లేదు. కాని నీకు కావాలంటే తప్ప

కుండా చేద్దాం. నేను కూడా టెస్ట్ చేయించుకుంటాను." అని అన్నాడు నన్ను దగ్గరికి తీసుకుంటూ, ఈ సారి నా వంతు అయిం ది- దిమ్మ తిరగడం. తన చేతిని గట్టిగా పట్టుకున్నాను వదిలి పెట్టకుండా. నాకు ఎంతో ధైర్యం కలిగింది. ఇంతకన్నా నాకు వేరే ఏమి కావాలి అని అనుకున్నాను

ఆ రాత్రి అట్లా గడిచిపోయింది.

ఈ విషయం మా అత్తగారికి మా అమ్మకి ఫోను చేసి చేప్పాము. మా అత్తగారు సంతోష పడ్డారు కాని " నీకు ఎందుకు రా బాబు ఈ టెస్టులు, నీవు మొగవాడివి కదా ఇది ఆడవాళ్ళ కి మాత్రమే వచ్చే సమస్య కదా " అని అన్నారు. దీనికి ప్రమోద్, " ఈ ప్రాబ్లం ఒక్క ఆడవాళ్ళదే కాదు అమ్మా ఇది మొగవాళ్ళకి కూడా వస్తుంది, చాలా శాతము మొగవాళ్ళకే ఈ ప్రాబ్లము ఎక్కువగా వుంటుంది ఆడవాళ్ళ కన్నా " అని అన్నాడు. దీనికి ఆవిడ "ఇదేక్కటి విడ్డూరంరా బాబూ " అని అన్నారు అని ప్రమో ద్ నాతో చెప్పాడు. ఈ టెస్టులన్ని చేయించుకోవటానికి ఇద్దరము ఒక వారం సెలవు పెట్టాము. మా ఫామిలి డాక్టర్ దగ్గరకు వేళ్ళాము, అన్ని విషయాలు ఆయనకి చేప్పాము. అన్నీవిని ఆయన మమ్మల్ని స్పెషలిస్టు, యూరాలజిస్టు దగ్గరికి వెళ్ళమని సలహా ఇచ్చారు. మొదటి సెషన్లో ఆ డాక్టర్ నా నెలవారీ పీరియ డ్స్, ఆరోగ్యం గురించి చాల వివరాలు అడిగి తెలుసుకున్నారు పిరియడ్స్ రెగ్యులరా కాదా, ఓవ్యులేషన్ సరిగ్గా వుందా లేదా అని. ఫెర్టైల్ పీరియడ్లో ట్రై చేస్తున్నామా లేదా అని అడిగి తెలుసు కున్నారు.

నన్ను బ్లడ్-టెస్టు కి, అల్ట్రాసౌండ్ కి పంపారు, ఎండోమె ట్రియం, అంటే గర్భాశయ లైనింగ్ గురించి తెలుసుకోవటానికి, లైనింగు దళసరి అవటానికి, హార్మోన్సు సరిగా తయారవుతున్నా యా అని తెలుసుకోవడానికి. ఎండోమెట్రియోసిస్ ఏమయినా వు న్నదా అని తెలుసుకోవటానికి, ఈ విధంగా అన్ని టెస్టులకి వెళ్ళా ను. అన్ని టెస్టులు అయి రిజల్ట్సు వచ్చిన తరువాత, డాక్టర్ ఆఫీ స్ నుంచి కాల్ వచ్చింది, డాక్టర్ నీతో మాట్లాడతారు అని. నేను ప్రమోద్ వెళ్ళాము ఆయన్ని కలవటానికి. ఆయన చెప్పింది ఏమిటంటే నా టెస్టుల్లో ఎందులో కూడా ఏ రకమైన సమస్య లేదని అంతా నార్మల్ గా వుందని. ప్రమోద్ చాలా సంతోష పడి ఈ సంగతి వాళ్ళ అమ్మకి చేప్పాడు. ఆత్రుత పట్టలేక ఈ టెస్టు టైం కి ఆవిడ వచ్చేసారు. ఇక ప్రమోద్ కి స్పెషలిస్టు చెప్పినదేమిటంటే, సగానికి పైగా సంతాన సమస్యలు మగవాడి శుక్ర కణాల సంఖ్య పై ఆధార పడి ఉంటుందని, సెమెన్ అనాలిసిస్ చేస్తే మగవాడి శుక్ర కణాల సంఖ్య తెలుస్తుందని చెప్పాడట. ఆ సంఖ్య - స్పెర్మ్ రూపు రేఖల మీద , చలనం మీద ఆధారపడి ఉంటుందట. నార్మల్ స్పెర్మ్ కౌంట్, ఒక మిల్లీ లీటర్ స్పెర్మ్ కి ఒక కోటీ ఏభయ్ లక్షలు అంటే పదిహేను మిలియన్లు ఉండాలట. ఇంకా అనేక సమస్యల గురించి చెప్పేరని ప్రమోద్ నాకు ఆ రోజు రాత్రి చేప్పాడు. మరునాడు పోద్దునే లేచి టెస్ట్ లకి వెడుతున్నాని చెప్పి వేళ్ళి పోయాడు. రెండు రోజుల్లో అన్ని టెస్టులు పూర్తి అయ్యాయి. ఒక వారం తరువాత టెస్టు రిజల్ట్సు వచ్చాయని డాక్టర్ మీతో మాట్లాడాలని అనుకుంటున్నారు అని ఫోను వచ్చింది. మరు నాడు రమ్మని టైం ఇచ్చింది. మరునాడు మా అత్తగారు పోద్దున్నే లేచి రోజు చేసే పూజలే కాకుండా వేరే ఎక్స్ ట్రా పూజ చేసినట్టు అనిపించింది. బొట్టు పెట్టి ప్రసాదం ఇచ్చారు, ఆవిడ ముఖంలో ఆందోళన కోట్టవచ్చినట్టుగా కనిపించింది. ఆవిడతో ఏదైన అంటే ఏడుస్తారని భయపడి ఏమి అనకుండా వస్తామని చేప్పి బయటకి వచ్చేసాము. కారు వున్నా, ఆటో తీసుకున్నాము. డాక్టర్ ఆఫీసు వచ్చేవరకు తన చేతిని గట్టిగా పట్టుకుని కూర్చున్నాను, ఇద్దర ము సైలేంటు గా కూర్చున్నాము ఆటోలో. సరి అయిన టైంకే డాక్టర్ లోపలికి పిలిచాడు. ఆయన మాకు అర్ధం అయేట్టట్టు చేప్పిం ది ఏమిటంటే, ప్రమోద్ స్పర్మ్ కౌంట్ చాలా తక్కువగా వున్నదని, కాని దీని విషయంలో అంతగా కంగారు పడవలసిన అవసరము లేదు అని. ఈ సమస్యకి పరిష్కారాలు వున్నాయని, ఈ రోజుల్లో టెక్నాలాజి ఏంత అడ్వాన్స్ అయిందంటే ఉన్న ఆ ఒకటి – రెండు శుక్ర కణాల్ని తీసి , అండాన్నిఫలదీకరణం చేస్తున్నారు అని చెప్పారు. ఫలదీకరణం స్త్రీ గర్భంలో చెయ్యడం లేదా బయట పరిక్షనాళికలో చేసి గర్భంలో ప్రవేశ పెట్టడం అని చెప్పి, ఈ రెండు పద్దతులు చాల సేఫ్ అని చాలా సేఫు చేప్పి మీరు ఇంటికి వేళ్ళి ఆలోచించుకుని ఏ సంగతీ నాకు చెప్తే నేను మిగిలిన విషయాలుచూస్తాను అనిఅన్నాడు. మేము ఆయనకి థాంక్స్

చెప్పి బయట కు వచ్చి ఆటో మాట్లాడుకుని అందులోకి ఎక్కి కూర్చున్నాము ,

నేను తన వైపు తిరిగి ఏదో అనబోయే లోపలే తను నా వైపు తిరిగి "ఇల్లా అయితేనే బెటర్ పావనీ, ప్రాబ్లం నాలో వుండ టం మంచిదైంది. నాకు చాల సంతోషంగా వుంది" అని అన్నాడు. "అదేంటీ అల్లా అంటున్నావు" అని అడిగాను.

"ఇప్పుడు మా అమ్మ కాని, మా వైపు బందువులుకాని తప్పు నీది అనే అవకాశం లేదు, దీనితో అందరి నోర్లు మూత పడతాయి, పిల్లల్ని ఎప్పుడు కంటావే అని కొంటె కూతలూ కోసే అవకాశం లేదు".

"ఇప్పుడు ఏంతమంది నన్ను టార్గెట్ చేస్తారో చూద్దాము, మా అమ్మతో సహా, అని అన్నాడు.

"నేను మా అమ్మకి థాంక్స్ చేప్పుకోవాలి పరీక్షలు చేయించుకోమని ప్రోత్సహించినందుకు" అని అన్నాడు

మా ఇద్దరిలో ఒక రకమైన రిలీఫ్. హమ్మయ్య అనుకు న్నాను. ఇంటి దగ్గర ఆటో ఆగటంతో దిగి డబ్బులు ఆటో వాడికి ఇచ్చి లోపలికి వచ్చాము, మా అత్తగారు మా కోసం ఎదురు చూస్తున్నారు.

ప్రమోద్ వెళ్ళి ఆవిడ పక్కన కూర్చుని అన్ని విషయాలు విపులంగా ఆవిడకి అర్థం అయ్యేటట్లు చెప్పాడు.

ఆవిడకి కళ్ళనుంచి నీళ్ళు కారటం మొదలు పెట్టాయి, కాసేపు అయిన తరువాత కళ్ళ నీళ్ళు తుడుచుకుని,"మగ మహారాజువి నీకేమిటిరా ఇది, మన ఇంటా-వంటా లేనిది" అని అన్నారు.

"అదేమిటమ్మా అలా అంటావు, మన వంశంలో ఏంతో మందికి పిల్లలు లేరు, చాల తక్కువ మందికి, పిల్లలు ఉన్నా నా లాగా ఒకళ్ళు మాత్రమే. కొంతమంది అసలు గర్భమే దాల్చలేదు. కొంత మందికి ఎన్నో సార్లు కడుపు పోయిందని నీవే కదా చేప్పే దానివి. సమస్య మొగవాళ్ళదే అయినా ఆ ఆడవాళ్ళు ఎన్నెన్ని మాటలు పడ్డారమ్మా బంధువులతో. నీకు ఇవి అన్ని తెలియవా. ఎందుకమ్మా నిన్ను నీవు మభ్యపెట్టుకుంటావు? మన ఫామిలీ లోనే వుందమ్మా ఈ ప్రాబ్లం.", అని కోంచం కోపంగానే అన్నాడు ప్రమోద్. "టెస్టులు తప్పు చేసారేమోరా. రిజల్ట్సు మారినాయే మోరా లాబ్ లో " అత్తగారు అన్నారు. దానికి ప్రమోద్ -"ఎందుకు చేస్తారమ్మా తప్పులు ఇటువంటి లాబ్స్ లో, ఒకటికి రేండు సార్లు టెస్టులు రిపీట్ చేస్తారు, పంపేముందు కూడా రీచేక్ చేసి మరి పంపుతారు కనుక ఇటువటి తప్పులు జరగవమ్మా", అని అన్నాడు.

దీనితో ఆవిడ మళ్ళీ ఏమి మట్లాడలేదు, తన గదిలోకి వెళ్ళి పోయింది. నేను కూడా ఆవిడతో ఏమి మాట్లాడలేదు, నేను నా గదిలోకి వేళ్ళి అమ్మకి ఫోను చేసి చెప్పాను, అమ్మ గొంతులో కూడా రీలీఫ్ వినిపించింది.

"ఇప్పుడు ఎంచేస్తారు" అని ఆదుర్దా గా అడిగింది అమ్మ.

"నేను ప్రమోద్ మాట్లాడుకొని ఒక నిర్ణయానికి రావాలి, తరువాత ఫోను చేస్తాను" అని చేప్పి ఫోను పేట్టేసాను.

రెండు రోజుల తరువాత మా అత్తగారు హైదరబాదు వెళ్ళిపోయారు. ప్రమోద్ తన రోటీన్ లో పడిపోయాడు, ఏ రకమైన మార్పు లేదు తనలో. నాకు ఏంతో సపోర్టు ఇచ్చిన ప్రమోద్ ని ఇంక అనవసరంగా ఈ విషయంలో భాద పెట్ట దలుచుకోలేదు, అందుకని ఈ విషయం ఇంక ఏత్తలేదు. నేను కూడా నా రోటీన్ లో పడి పోయాను. మొదట్లోనే ఈ ప్రాబ్లం మన మధ్యకి రాకూడదని అనుకున్నాము కనుక ఇక ఈ ప్రసక్తి తీసుకు రాలేదు. ఒక రోజు తనే డిన్నర్ టైం లో ఈ ప్రసక్తీ తీసుకోచ్చాడు," పావని, డాక్టర్ చేప్పినదాని గురించి ఏమని నిర్ణయించావు? నీకు ఏట్లా ఇష్టం అయితే అట్లా చేద్దాము. ఏ విధంగా కూడా నీ మీద నా నిర్ణయాన్ని ఫోర్సు చేయ్యను. నాకు నువ్వు ఆనందంగా ఉండటమే కావాలి. టేక్ యువర్ ఓన్ టైం." అని అన్నాడు. "టైం తీసుకోవాల్సిన అవసరము లేదు ప్రమోద్. మనకేమీ ఇవన్నీ అవసరం లేదు. నేను చాలా సంతోషంగా వున్నాను, ఒక పేద్ద బరువు నా బుజాల మీది నుంచి దించినట్టు అయింది.

అత్తయ్యగారి కోరకు చేయించుకున్న టెస్టులు అవి, అంతకన్నా వేరే ఏమి లేదు. నిన్ను అనవసరంగా ఇబ్బంది పెట్టాను. నీవు అన్నట్టు వియ్ ఆర్ ఫైన్ ద వే వియ్ ఆర్, భవిష్యత్ లో ఒక వేళ్ళ మనం పిల్లలు కావాలి అని అనుకుంటే ఎంతో మంది అనాధ పిల్లలు వున్నారు, వాళ్ళలో ఒకర్ని అడాప్ట్ చేసుకుందా ము లేదా అక్కడి పిల్లల చదువులకి సహాయం చేద్దాము" అని

అన్నాను. చిరునవ్వు అతని పెదవుల మీద కనపడింది. ఎన్ని రోజు లు అయిందో తనని అట్లా చూసి.

"దట్స్ మై బేబి ' అని లేచి చేతులు కడుక్కోని నా చైర్ దగ్గరికి వచ్చి నా బుగ్గ మీద ముద్దు పెట్టుకున్నాడు."

"ఐయాం సో ప్రౌడ్ ఆఫ్ యూ పావనీ" అని నన్ను దగ్గరి కి తీసుకున్నాడు. "పద. సరదాగా పార్క్ లో నడుద్దాం" అని అన్నాడు ఏంతో వుత్సాహంగా. నాకు కుడా చాల రోజుల తరువాత సంతోషం కలిగింది.

నేను వంటింట్లో ఎక్కడివి అక్కడ వదిలేసి చేతులు కడుక్కుని వచ్చాను.ఇద్దరం చెప్పులు వేసుకుని బయటకు వచ్చి డోర్ ని లాక్ చేసి ఒకళ్ళ చేతులు ఒకళ్ళు పట్టుకుని నడవటం మొదలు పెట్టాము. ఎన్ని రోజులు అయిందో ఇట్లా మేము వాక్ కి వెళ్ళి. పున్నమి అనుకుంటాను, వెన్నెల కురిసిపోతోంది బయట, సన్నటి గాలి వీస్తోంది, ఎంతో హాయిగా, ప్రశాంతంగా వుంది వాతావరణం, మా మనస్సుల్లాగా!

(Author's Note: Google research was done for the information about human infertility and fertility)

తెలుగు కళా సమితి 30 వ వార్షికోత్సవ వేడుకల చిత్ర మాలిక -1



## రావిశాస్త్రి - 'పక్కింటి అబ్బాయి' - పరిచయం

డా. వై.వి. రమణ, గుంటూరు (ఇండియా)



నిరంజనరావుకి తండ్రి లేడు. భూమ్మీద పడగానే అతనికి అమ్మా, ఆకలి తప్ప మరేం దక్కలేదు. అందుకే పరిస్థితుల్ని జయించి పైస్థాయికి వెళ్ళాలనే కసి కూడా అప్పుడే కలిగింది.

అతని మాటలు వేసవికాలంలో మల్లెపువ్వుల్లా మధురంగా ఉండవు. చలికాలంలో వానచినుకుల్లా చురుక్కుమంటాయి... నిశ్చలంగా ఉన్నప్పటికీ అతను ధ్యానంలో ఉన్న యోగిలా నిర్మలంగా కనిపించడు. సత్రంలో బైరాగిలా చవగ్గా కూడా కనిపించడు. పుట్టలో పాములా భయంకరంగా కనిపిస్తాడు.

నిరంజనరావుకి తనచుట్టూ ఉండే దారిద్ర్యపు వాతావరణం అన్నా, తనచుట్టూ ఉండే తనలాంటివారన్నా తెగ ద్వేషం ప్రబలింది... అంతా ఒకే జెయిల్లో ఉన్నప్పటికీ అమెరికాలో తెల్లఖైదీలు నల్లఖైదీలని చూసినట్లు సాటివారిని చూసి అసహ్యిం చుకోనారంభించాడు...జీవితంలో అమరసౌఖ్యాలున్నాయనీ, వాటి ని "చదువు" ద్వారా సంపాదించుకోవచ్చని అతను గ్రహిం చాడు.

పోటీ పరీక్షకి ప్రిపేర్ అవ్వటం కోసం చేస్తున్న చిన్న ఉద్యోగాన్ని వదులుకొని.. పట్నంలో ఒక గది అద్దెకి తీసుకుంటా డు. ఇంటి ఓనర్ పక్కగదిని దగ్గర్లోనే ఉన్న ధర్మాసుపత్రి వైద్యనిమిత్తం వచ్చేవారికి రోజువారి అద్దె పద్ధతిన ఇస్తుంటాడు. పరీక్షల కోసం నిరంజనుడు భీకరంగా చదువుతుండగా పక్కగదిలో కి ఒక పేదకుటుంబం అద్దెకొస్తుంది.

ఆ కుటుంబంలోని భర్తకి చర్మం, దంతం, ఎమిక, దగ్గు తప్ప అతన్లో ఇంకేమి ఉన్నట్లులేవు... ఆ ఆడమనిషి పుల్లలా ఉంది. ఆమె గుండెలు అర్చుకుపోయాయి. ఆమె ముఖం పీక్కు పోయింది. ఆమె కళ్ళు పిల్లిని చూసిన ఎలక కళ్ళల్లా లేవు! పులిని చూసిన లేడి కళ్ళల్లా వున్నాయి. ఆ లేడైనా అర్నెల్లనించీ ఏఆకూ, అలమూ దొరక్క ఉప్పునీళ్ళు తాగి బతుకుతున్న లేడన్నమాట... ఆవిడ పెద్దడాక్టర్ల ముందు నగ్నంగా నిల్చున్న జబ్బుమనిషిలా చాలా దీనంగా కనిపిస్తుంది. ఆ పిల్లవాడి ఏడుపు చాలా ఘోరంగా నూ, భయంకరంగానూ ఉంది. ఆ పిల్లవాడి ఏడుపు తన చదువుకి తీవ్రఆటంకంగా పరిణ మిస్తుంది. భర్త ధర్మాసుపత్రిలో చేరతాడు. ఓ అర్ధరాత్రి ఆ పిల్లవాడి కి ప్రాణం మీదకొస్తుంది. ఆ ఆడమనిషి నిరంజనరావుని ఆస్పత్రి దాకా తోడు రమ్మని దీనంగా అర్థిస్తుంది. అప్పటికే చిర్రెత్తిపోయి న్న నిరంజనం గావుకేకలు వేస్తాడు.

"పిలవను. రిక్షా పిలవను! రాను. ఆస్పత్రికి రాను. చెయ్యను. సహాయం చెయ్యను. మీకోసం నేను పూచికపుల్ల మొయ్యను. నా చూపుడువేలు చూపిస్తే చాలు మీరంతా బాధల బురదల్లోంచి బైటపడి బంగారులోకాల్లో విహరిస్తానంటే నేను చూపుడువేలు చూపించను! ఎందుకు చూపించాలి?" అంటూ తలుపులు ఫెడిల్మంటూ మూసేసుకున్నాడు.

తెల్లారి చూస్తే ఆ ఆడమనిషి గది ఖాళీ చేసి వెళ్ళి పోయింది. కథని రావిశాస్త్రి తనకి అలవాటైన ధోరణిలో ఈ విధంగా ముగిస్తాడు.

*"ఇదంతా జరిగి ఎన్నాళ్ళయిందండీ?"*

*"పదిహేనేళ్ళయింది సార్!"*

*"మరైతే - రంజనుడో నిరంజనుడో - అతనేం చేస్తున్నాడండీ ఇప్పుడు?"*

*"వాడిప్పుడు ప్రజలపై పన్నులు విధించే ప్రభుత్వ ప్రత్యేకశాఖలో ప్రధానోద్యోగిగా ఉంటున్నాడు సార్!"*

తొలి ప్రచురణ - ఆంధ్రజ్యోతి వారపత్రిక (07-14-1967) . పుస్తక రూపం - బాకీ కథలు.

జీవితంలో అమరసౌఖ్యాలని సంపాదించుకోవటానికి "చదువు" మార్గన్నెంచుకున్న నిరంజనరావుని.. చదువులు, పోటీపరీక్షలు ద్వారా ఉద్యోగాలు సంపాదించుకుని.. సమాజం పట్ల పూర్తి బాధ్యతారాహిత్యంగా ఉండే ప్రభుత్వోద్యోగులకి ప్రతీకగా తీసు కున్నాడు.

నిరంజనమంటే మనకి అసహ్యం కలిగేట్లు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకున్నాడు. అయినా.. అనుమానం వచ్చిందేమో!..

వెంకట్రావనే చిన్ననాటి స్నేహితుడిని నిరంజనుడు ఎలా చంపేశా డో చెప్పి... మనకి నిరంజనుడి పట్ల రోత కలిగేట్లు రాశాడు. బహుశా... మంచికి చెడు చెయ్యరాదు. చెడుకు మంచి చెయ్య రాదనే తన రచనా పాలసీననుసరించి... ఈ (అతి) జాగ్రత్త తీసుకునుంటాడు.

చదువు లేనివాడు చదువుకున్నవాడిని ఎందుకు గౌరవి స్తాడు? చదువు జ్ఞానాన్నిస్తుందని. సమసమాజ కాంక్షని పెంచు తుందని. కేవలం ఉన్నత స్థానాల కోసం, ఉద్యోగాల కోసం, డబ్బు సంపాదించుకునేందుకు 'చదువు' ఒక మార్గంగా ఎంచు కునేవారు సమాజానికి కీడే చేస్తారని ఈ కథలో రావిశాస్త్రి చెబుతాడు.

నేనీ కథని ఇరవైసార్లు చదివుంటాను. తన పాయింట్ ని కథారూపంలో మలచడానికి రావిశాస్త్రి ఎంచుకున్న శైలి అనితర సాధ్యం. అందుకే ఎన్నిసార్లు చదివినా.. 'ఇంత గొప్పగా ఎలా రాశాడబ్బా!' అని ఆశ్చర్యపోతూ చదువుతుంటాను.

రావిశాస్త్రి ఈ కథ రాసి 45 సంవత్సరాలు నిండాయి. ఇప్పుడు నిరంజనుడి వారసులు ఉద్యోగాలేం ఖర్మ! అన్ని రంగా ల్లో చెలరేగిపోతున్నారు. రోజురోజుకీ వీరి సంఖ్య పెరిగి పోతుందే మోనన్న భయాందోళనలు చెందవలసిన పరిస్థితులు ప్రస్తుతం మనకున్నాయి.

**(రచయిత గుంటూరు లో మానసిక వైద్యులు. తెలుగు బ్లాగర్.)**

తెలుగు కళా సమితి 30 వ వార్షికోత్సవ వేడుకల చిత్ర మాలిక -2










“నాకు పదివేలు అప్పుకావాలి. సర్దగలవా?”, అప్పారావు జమ్బులింగాన్ని అడిగాడు. “పదివేలా? అంత పెద్ద అవసరం ఏమొచ్చిం ది?”, జంబులింగం ఆరా తీసాడు. “ అవసరం చిన్నదే. కనీ మళ్ళీ మళ్ళీ అప్పడిగితే బావుండదు కదా!” అప్పారావు సమాధానానికి జంబులింగం నోరావలించాడు.


... YOUR JEWELER FOR EXQUISITE DESIGNS ...
... HALLMARK JEWELLERY ...
... BEST IN QUALITY AND PRICES ...
... EXCELLENT CUSTOMER SERVICE ...
... WE BUY AND EXCHANGE OLD GOLD ...
... WE BUY AND SELL 24K GOLD AND SILVER BARS / COINS ...
Swarna Jewels
Quality, our Tradition
2101 STREET ROAD BENSALEM PA 19020
WWW.SWARNAJEWELS.NET
PH: (215)-633-0708
TIMINGS:
11:30 AM – 7:30 PM
TUESDAY CLOSED
For more details, contact store.

Telugu Fine Arts Society (TFAS)
c/o Vamsi Koppuravuri
1 Newburgh Drive, Edison, NJ - 08820

PRSRT STD
US Postage PAID
Permit #6
New Brunswick, NJ

Return Service Requested

# IN MEMORY OF SHANTHI SRIKONDA

## DECEMBER 27, 1941 - JUNE 11, 2001

**Fourteen years have passed since you left us**
**Every day as I walk through the garden you are always there**
**Reminding me the passion and love for flowers since your childhood**
**I always remember making the jasmine garlands**
**You were so happy to wear them all day**

**The past year has been a difficult and trying one for all of us**
**As each crisis came through I was not sure how I will deal**
**Then I remembered how you always had a positive attitude**
**And tried to be calm and tell me that everything will turn out for good**
**There are times that I want to give up and walk away**
**But you were always there to tell me to think about the family**
**Be strong and never give up and lose hope**



**Thank you for being with me and giving me the strength to keep going.**



**Your childhood sweetheart**
**And always loving husband, Satya**

**Shashi,Vijaya and Shanivi**
**Sanjay & Nalin**
**Susheel, Susan, Raina and Vikram**
**June 11, 2015**

*Shanthi Travel, Inc.*
Ph. 973-423-4444; Shanthitravel_99@yahoo.com